జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | మంగళవారం 12 మే 2026 | సంపుటి: 19 | సంచిక: 65 | పేజీలు: 21 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , జ్యేష్ఠ మాసము , తిథి: అష్టమి - 15:09:36 వరకు నక్షత్రంధనిష్ఠ - 24:50:46 వరకు కరణంకౌలవ - 15:09:36 వరకు, తైతిల - 27:24:43 వరకు పక్షంకృష్ణ యోగంబ్రహ్మ - 26:07:47 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## సర్ ప్రక్రియపై సిఇవో సమీక్ష

**పకడ్బందీ మ్యాపింగ్ చేపట్టాలని ఆదేశం**

హైదరాబాద్,మే 11(ప్రజాజ్యోతి): భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా ఎన్నికల అధికారులు , ఎన్నికల నమోదు అధికారులు తో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, సోమవారం హైదరాబాద్‌లోని సీఈఓ

మిగతా1 2లో..

## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

**సభ్యులుగా శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ**

**మరో సహభ్యురాలుగా చాకలి ఐలమ్మ మనవరాలు**

హైదరాబాద్,మే11(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు ప్రభుత్వం కొత్త నియామకాలు చేపట్టింది. మహిళా హక్కుల పరిరక్షణ, మహిళా సంక్షేమ కార్యక్రమాల పర్యవేక్షణ కోసం కీలకమైన తెలంగాణ మహిళా

మిగతా 2లో..

# అభివృద్ధికి కేంద్ర సహకారం తప్పనిసరి

**రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి తీసుకు వెళతామని మోడీ అన్నారు**

**"ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేశారు. వేర్వేరు రెసిడెన్షియల్స్ వల్ల కులవివక్ష పెరుగుతుందని మేం గ్రహించాం. కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 9 వస్తువులతో కూడిన విద్యా కిట్‌ను అందివ్వనున్నాం. విద్యార్థులకు ఇచ్చే ఎడ్యుకేషన్ కిట్ కోసం రూ.1100 కోట్లు కేటాయించాం. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా మారాలి" - రేవంత్ రెడ్డి, సీఎం**

**రాష్ట్ర ప్రాజెక్టుకు అనుమతులను మాత్రమే కోరాం**

**రాష్ట్రప్రయోజనాల కోసమే నా పోరాటం**

- బీజేపీని ఓడించి సీఎం అయిన వ్యక్తిని నేను
- బీజేపీ అంటే.. బ్రిటిష్ జనతా పార్టీ
- విభజించు పాలించడం బీజేపీ రాజకీయం
- సర్ పేరుతో రాష్ట్రాల్లో చొరబడే యత్నం
- జెమిని సర్కస్‌లా బీజేపీ ఎన్నికల విధానం
- మోడీ పాలనాను భవ రాహిత్యంతో దేశానికి నష్టం
- మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్,మే11(ప్రజాజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. అభివృద్ధి విషయంలో కలిసి పనిచేద్దామని ప్రధాని చెప్పారని.. తమ మధ్య జరిగిన చర్చ పూర్తిగా అభివృద్ధికి సంబంధించినదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ హక్కుల కోసం తాము కేంద్రంతో పోరాడుతామని కూడా వ్యాఖ్యానించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ చిట్‌చాట్‌లో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ విధానాలు, రాష్ట్ర అభివృద్ధి, మావోయిస్టుల సరెండర్‌లు, మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్, బండి భగీరథ్ కేసు వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హెచ్ఐసీసీలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను ప్రస్తావించిన అభివృద్ధి అంశాలను ప్రధాని మోదీ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర సహకారం అవసరమని, అదే విషయాన్ని మోదీ దృష్టికి తాను తీసుకెళ్లానని చెప్పుకొచ్చారు. 'నేను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రిని... కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం

మిగతా 2లో..

## కులానికో రెసిడెన్షియల్ పాఠశాల

- వీటితో సమాజాంలో పెరుగుతున్న కులవివక్ష
- కులవివక్ష రూపు మాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
- విద్యారంగ అభివృద్ధి కోసమే విద్యాశాఖను పర్యవేక్షస్తున్నా
- 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో విద్యా వారోత్సవాలు
- ఎల్బీ స్టేడియంలో ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్,మే 11(ప్రజాజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల కుల వివక్ష పెరుగుతుందని మేం గ్రహించాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా మారాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యా వ్యవస్థకు సంబంధించి రూ.1,100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఎల్బీ స్టేడియం లో ఏర్పాటు చేసిన వేదికపై ఈ వారోత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని ఈ శాఖను తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు.

మిగతా 2లో..

## సరిహద్దుల్లో కంచె నిర్మాణం

**బెంగాల్ నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం**

**సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు అంగీకారం**

**ఉద్యోగుల పదవీవిరమణ వయసు పెంపు**

**మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం**



కోల్‌కతా,మే 11(ప్రజాజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటైన నూతన ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్– బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కంచె నిర్మాణం కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని కేటాయిస్తూ తొలి మంత్రివర్గ సమావేశంలోనే నిర్ణయం తీసుకుంది. దీనిపై

మిగతా 2లో..

## జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

**ఇలాంటి వారు దేశాన్ని నడపడం కష్టం**

**ఎక్స్ వేదికగా రాహుల్ విమర్శలు**

న్యూఢిల్లీ,మే11(ప్రజాజ్యోతి): కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మోదీ జవాబుదారీతనాన్ని కోల్పోయారని అన్నారు. ప్రజలు ఏం కొనాలో.. ఏం కొనకూడదో చెప్పే పరిస్థితికి మోదీ వచ్చారంటూ మండిపడ్డారు. తెలంగాణ సభలో మోదీ చెప్పినవి ప్రబోధాలు కావని,

మిగతా 12లో..





## బండి కుమారుడి కేసుపై సీఎం సీరియస్

- తక్షణ విచారణకు డీజీపీని ఆదేశించిన రేవంత్
- సిట్ ఏర్పాటు చేస్తూ డీజీపీ ఉత్తర్వులు

హైదరాబాద్,మే11( ప్రజాజ్యోతి): కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసుపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్

మిగతా 12లో..

## 13న పాలిటెక్నిక్ ప్రవేశ రీక్ష

**పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి**

హైదరాబాద్,మే11(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో ఈనెల 13న నిర్వహించనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకుఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ,ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ, ఉద్యానవన , వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి ఉదయం 11 గంటల

మిగతా 12లో..





# కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం

**కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తెలంగాణ**

**శాస్త్రీయంగా కనీస వేతనాల సవరణ**

**వాస్తవ అవసరాలకు తగ్గట్టే వేతనాలు**

**కనీస వేతన సవరణపై సబ్‌కమిటీ భేటీలో భట్టి**

**లేబర్ కోడ్ ప్రభావంపై సుదీర్ఘంగా చర్చ**

హైదరాబాద్,మే 11(ప్రజాజ్యోతి): కార్మికుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడమే తమ ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు, అధికారులు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి హాజరయ్యారు. శాస్త్రీయంగా కనీస వేతనాల సవరణ చేపడతామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇతర రాష్ట్రాల కనీస వేతన విధానాలపై సమీక్షిస్తామని

మిగతా 12లో..

## ఆరోగ్యశాఖలో 1919 నర్సింగ్ ఆఫీసర్ నియామకం

**నేడు నియామక పత్రాలు అందించనున్న మంత్రి దామోదర**

హైదరాబాద్,మే11(ప్రజాజ్యోతి): ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో నర్సింగ్ నియామకాలు చేపట్టింది. రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఎంపికైన 1919 మంది నర్సింగ్ ఆఫీసర్లకు మంగళవారం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ నియామక పత్రాలను అందజేయనున్నారు. ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో మంగళశారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. భారీసంఖ్యలో అభ్యర్థులు హాజరుకానుండటంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, కూర్చునే సదుపాయం, ట్రాఫిక్

మిగతా 2లో..

## గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత

- రేవంత్ డైరెక్షన్‌లోనే కూల్చివేతలు
- కూల్చిన ఆలయం వద్ద పరిశీలించిన హరీష్



వరంగల్,మే11(ప్రజాజ్యోతి): లంకెబిందెల కోసమే పురాతమైన ఆలయాలను కూల్చివేస్తున్నారని, సీఎం రేవంత్ రెడ్డికి కూల్చడం తప్ప కట్టడం రాదని శాసనసభ విపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. వరంగల్ జిల్లా ఖానపురం మండలం అశోక్ నగర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేసిన 800 ఏండ్ల చారిత్రక కాకతీయ కట్టడం శివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుప్త నిధుల కోసం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లో తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. స్కూల్ నిర్మాణం కోసం అయితే అర్ధరాత్రి తవ్వకాలు ఎందుకు చేపట్టారని ప్రశ్నించారు. గర్భగుడి కింద 24 అడుగుల లోతు తవ్వాకాలు చేపట్టారని పురావస్తు శాఖ తేల్చింది. ఆలయాల కూల్చివేతపై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుంత్వం రాగానే దేవాదాయ శాఖ భూమి ప్రభుత్వ భూమిగా మారిందన్నారు. గుప్త నిధుల వేటలో ప్రభుత్వ పెద్దలు ఉన్నారన్నారు. పేదల ఇళ్లతో పాటు గుళ్లను కూల్చివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో

మిగతా 12లో..

# సంపాదకీయం

## రాజకీయ పార్టీల్లో సర్ భయాలు!

సర్ ప్రక్రియ పేరు చెబితేనే రాజకీయ పార్టీల్లో గుబులు పుడుతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో త్వరలోనే సర్ ప్రక్రియ మొదుల కానుంది. దీంతో ఓటర్ల ఏరివేత చేపడతారు. చనిపోయిన వారి, బోగస్ ఓట్లతో పాటు, డబుల్ ఓట్లు, ఇతర రాష్ట్రాల్లోనూ ఉన్న ఓట్లను తొలగిస్తారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ సాగింది. ఇప్పుడు ఎపి, తెలంగాణలో సాగనుంది. అయితే సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్, బిఆర్ఎస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు తమ పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశాయి. బూత్ లెవల్లో అప్రమత్తం గా ఉండాలని హెచ్చరించాయి. దీనినిబట్టి వీరి ఆందోళన ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. నిజంగానే అవసరమే. అర్హులైన వారి ఓట్లను తొలగిస్తే ఆక్షేపించాల్సిందే. అడ్డుకోవాల్సిందే. అలాగే నకిలీ ఓట్లను తొలగిండంలో కూడా రాజకీయ పార్టీలు సహకరించాలి. సర్ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా సంస్కరించే కార్యక్రమం దేశం నలుమూలలా సంచలనంగా మారిన నేపథ్యంలో ఈ భయాందోళనలు వెన్నాడుతున్నాయి. ఈ కార్యక్రమం ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఆయా రాష్ట్రాల్లో చేపట్టడం జరిగింది. అయితే జాబితాను సంస్కరించడం ఇదే మొదటిసారి కాదు. 1951 నుంచి 2004 వరకు ఇలాంటి కార్యక్రమం 8 సార్లు జరిగింది. 2004 తర్వాత మళ్లీ ఇప్పుడు అంటే 21 ఏండ్ల తర్వాత ఈసీ ఈ కార్యక్రమం చేపట్టింది. అయితే ఇంతకు మునుపు లేని గందరగోళం, దుమారం ఇప్పుడే ఎందుకనేది ప్రశ్న.సర్ పేరుతో లక్షలాది మంది పేర్లను ఓటర్ల జాబితాలనుంచి తొలగిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. అందుకే రాజకీయ పార్టీల్లో ఇది భయాందోళన కలిగిస్తుంది. రాజకీయా పార్టీలు కావాలని ఓటర్లను చేర్పిస్తుంటారు. ఇందులో బోగస్ ఓట్లు కూడా ఉంటాయి. ఓటు అనేది రాజ్యాంగం ప్రతి పౌరుడికీ కల్పించిన హక్కు. అది ప్రతి ఒక్కరికి అవసరం. ప్రజాస్వామ్యంలో ఓటర్ గా నమోదు చేసుకోవడం బాధ్యత. ఓటు వేయడం కూడా అంతే బాధ్యతగానే భావించాలి. కానీ రాజకీయ పార్టీలకు తమ బోగస్ ఓట్లు తొలగి పోతాయన్న భయం పట్టుకుంది. బెంగాల్, బాహార్‌లలో చొరబాటుదారులను ఓటర్లు చేర్చారు. అలా లక్షల్లో ఓట్లు చేరిపోయాయి. అందుకే ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా వాటిని తొలగించింది. దీంతో ఆయా రాష్ట్రాల్లో నేతలు లబోదిబోమన్నారు. అర్హులు అనర్హులవటం, లేక ఇప్పుడు అనర్హులు భవిషత్తులో అర్హులవ్వటం జరగరాదు. ఓటరు మరణించినప్పుడు వాటిని తొలగగించాలి. అలాగే అనర్హులు లేదా ఇతర దేశీయులు ఉన్నప్పుడు కూడా వాటిని తొలగించాలి. అందుకే సర్ ప్రక్రియ అదే పనిచేస్తుంది. మరొక కారణం ఒక మనిషి పేరుమీద రెండు ఓట్లు ఉన్నప్పుడు. కూడా తొలగించడం సరైన చర్యనే. ఉమ్మడి ఎపిలో ఆంధ్రావాళ్లవి తెలంగాణలో కూడా ఓట్లు ఉండేవి. రెండు విడతల ఎన్నికలు జరిగినప్పుడు ఇక్కడా, అక్కడా ఓటేసిన సందర్భాలు కోకొల్లలు. ఇలాంటివి సహేతుకమైన కారణాలుగా గుర్తించి తొలగించాల్సి ఉంటుంది. వీటిమీద ఎవరికీ అభ్యంతరం వుండకూడదు. రాజకీయ పార్టీలు ఇలాంటి వారి విషయంలో సమాచారం అందచేయాలి. ఇటీవల ఎన్నికల సంఘం ఒక్క బెంగాల్ లో 90 లక్షల మందిని ఓటరు జాబితా నుంచి తొలగించింది. ఇందులో బంగ్లా నుంచి దొంగచాటుగా వచ్చిన వారే 90శాతం మంది ఉన్నారు. ఒక వ్యక్తికి ఒకటే ఆధార్ కార్డు, ఒకే పాన్‌కార్డు, ఒకే పాస్‌పోర్ట్ ఉంటుంది. వారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడి, ఒక మనిషికి ఒకే ఓటు ఉండేలా చేయటం సాధ్యం అయ్యేదా అయినా ఎన్నికల సంఘం ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం లేదు. ఓటరు తమ అడ్రస్‌ను మార్చుకునే వెసులబాటు ఉండాలి. ఆధార్, ఫోన్ నంబర్ లింక్ అయితే సమస్య రాదు. తాము జీవించి ఉన్నామని నిరూపించుకునే ఆన్‌లైన్ వెసులు బాటు కల్పించగలిగితే మరీ మంచిది. బ్యాంకు ఖాతా, పాన్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసినట్టు, ఓటరు కార్డు కూడా ఆధార్‌తో అనుసంధానం చేయడం ద్వారా దొంగ ఓట్లను అరికట్టవచ్చు. ఎన్నికల్లో బయోమెట్రిక్ ఆధారంగా ఓటు వేసే విధానం తీసుకురాగలిగితే ఇక పంచాయితీయే ఉండదు. ఇలా చేస్తే.. ఓటరు జాబితా వెరిఫికేషన్ పేరుతో ఎన్నికల సంఘం చేపడుతున్న సర్ ప్రక్రియ అవసరం రాకపోవచ్చు. ప్రజాస్వామ్య పక్రియను పూర్తిగా పటిష్టం చేయగలుగుతాం. రాష్ట్రాలు, రాజకీయ పార్టీలు కూడా ఇలాంటి అధునాతన ఆలోచనలకు పూనుకోవాలి. అప్పుడు ప్రక్షాళనతో పిలేకుండా మరణించిన వారి పేర్లను తొలగించటం సులభం కాగలదు. రెండు ఓట్లు కలిగి ఉన్న ఓటర్లు ఒకే ఓటు కలిగి ఉండేలా పక్కాగా ఓటరు కార్డును రూపొందించాలి. ఓటుకు పక్కాగా ఆధ్యార్ తరహాలో నంబర్ కేటాయించాలి. ఓటును తొలగించటం అనే అంశం మీద సరైన ఏకాభిప్రాయం, అవగాహన రాజకీయ పార్టీల్లోనే లేదు. అందువల్ల ముందుగా పక్కాగా ఓటు నమోదు జరగాలి. దానికి పక్కాగా కార్డు ఉండాలి. నంబరుతో కూడిన ఆధార్, పాన్ తరహా కార్డులను జారీచేయాలి. రాజకీయ పార్టీలు ఇందుకు సహకరించాలి. కానీ దొంగఓట్లకు అలవాటు పడ్డ పార్టీలు అందుకు ముందుకు రావడం లేదు. అందుకే సర్ ప్రక్రియ పేరు చెప్పగానే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ఓట్లు తొలగిస్తున్నారని అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

## సరిహద్దుల్లో కంచె నిర్మాణం

మొదటిపేజీ తరువాయి..

ముఖ్యమంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగానే బంగ్లాదేశ్ వెంబడి ఉన్న సరిహద్దుల్లో కంచె నిర్మాణానికి బీఎస్ఎఫ్‌కు భూమిని బదిలీ చేశామన్నారు. మరో 45రోజుల్లో ఈ పక్రియ పూర్తవుతుందన్నారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకంతో పాటు ఇతర పథకాలనూ రాష్ట్రంలో అమలు చేయనున్నట్లు ప్రకటించారు.

బెంగాల్లో తాము అమలు చేయనున్న అనేక సంక్షేమ పథకాలను సువేందు అధికారి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం వెల్లడించింది. అందులో జూన్ 1నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ల్పించనున్నట్లు ప్రకటించింది. దీనివల్ల ప్రజా రవాణాపై ఆధారపడే లక్షలాదిమంది మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు ప్రయోజనం పొందుతారని అధికారులు పేర్కొన్నారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. జూన్ 1నుంచి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ప్రారంభమైనప్పటికీ.. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలూ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో హామీ ఇచ్చిన విధంగా ఇతర పథకాలనూ త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా హామీ ఇచ్చినట్లుగా.. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్లు పొడిగించే ప్రతిపాదనకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపిందని సువేందు పేర్కొన్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జారీ చేసిన జూన్ 2025 జనగణన సర్క్యులర్‌ను గత ప్రభుత్వం విస్మరించిందని.. దానిని తక్షణమే అమలు చేసేలా మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు.

## కులానికో రెసిడెన్షియల్ పాఠశాల

మొదటిపేజీ తరువాయి..

విద్యావ్యవస్థలోనూ తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైంది. వివక్ష వల్లే 1969లో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైంది. అప్పటి నుంచి కొన్ని దశాబ్దాల పాటు పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. వర్సిటీలు నిర్లక్ష్యానికి గురైతే మన విద్యా వ్యవస్థ ప్రమాణాలు పడిపోతాయని గ్రహించాం. పేద బడుగు బలహీన వర్గాలకు సైతం నాణ్యమైన విద్యను అందించడం మా ప్రభుత్వం బాధ్యతగా భావిస్తుంది. మేం అధికారంలోకి రాగానే 11వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించాం. వివాదాలకు తావులేకుండా 36వేల మంది టీచర్లను బదిలీ చేశాం అని వివరించారు. రాష్ట్రంలోని 27వేల పాఠశాలల్లో 19లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. రాష్ట్రంలో విద్యార్థి, టీచర్ నిష్పత్తి 17:1గా ఉంది. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను మనం అధిగమించాలి. ఫలితాల్లో ప్రైవేటుతో పోలిస్తే ఎందుకు వెనకబడి ఉన్నామో ఆలోచించాలి. కమిషన్ సిఫార్సుల ప్రకారం విద్యాశాఖకు నిధులు 15 శాతానికి పెంచుతాం. విదేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేయాలని 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించాం. అవసరమైతే మరిన్ని దేశాలకు పంపించి.. ఉత్తమ విద్యా విధానాలను తెలంగాణలో అమలు చేస్తాం అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం పెట్టనున్నాం. మధ్యాహ్న భోజనంతోపాటు బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టాలని నిర్ణయించాం. ఈ పథకాన్ని కొన్ని పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాం. విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నాం. టెన్ ప్లస్ టూ విధానం లేకపోవడం వల్లే పది తర్వాత డ్రాప్ అవుట్లు పెరుగుతున్నాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును మార్చే దిశగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రూ. 1,011 కోట్లతో క్యూర్ ప్రాంతంలో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. విద్యాశాఖ స్టాల్స్ ను సందర్శించిన సీఎం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. 'తెలంగాణ సమాజం బలోపేతం కావాలంటే విద్య, వైద్యం అందరికీ సమానంగా అందాలి. అందుకే విద్యాశాఖను వేరే ఎవరికీ ఇవ్వకుండా నేనే నా దగ్గర పెట్టుకున్నాను. సమీక్షల సమయంలో నన్ను సీఎంగా కాకుండా విద్యాశాఖ మంత్రిగా చూడండి. తండాలు, గూడాలు, మారుమూల గ్రామాల్లోని పేద బిడ్డలకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని ఆయన స్పష్టం చేశారు. అవుటర్ రింగ్ లోపల ఉన్న విద్యా సంస్థల అభివృద్ధి కోసం రూ. 1,700 కోట్లతో ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ విద్యపై తమకున్న చిత్తశుద్ధిని చాటుతూ, కేవలం 60 రోజుల్లోనే 11,000 ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని సీఎం గుర్తు చేశారు. దాదాపు 22 వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు, ఎంతో క్లిష్టమైన 36 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలను ఎలాంటి వివాదం లేకుండా పూర్తి చేశామన్నారు. ఈ విజయాలను నీతి ఆయోగ్ సైతం అభినందించిందని ఆయన గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో 12 వేల ప్రైవేట్ స్కూళ్లలో 38 లక్షల మంది ఉంటే, 27 వేల ప్రభుత్వ స్కూళ్లలో 19 లక్షల మంది చదువుకుంటున్నారు. ప్రైవేట్ స్కూళ్లలో ఉన్న గొప్పతనం ఏమిటి? ప్రభుత్వ స్కూళ్లలో లోపం ఏమిటి? అని ప్రశ్నించుకోవాలి. అందుకే మేము ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యను ప్రవేశపెడుతున్నాం' అని ముఖ్యమంత్రి ప్రకటించారు. బడ్జెట్‌లో విద్యకు కేటాయించిన 8 శాతం నిధులను క్రమంగా 15 శాతానికి పెంచుతామన్నారు. 100 నియోజకవర్గాల్లో రూ. 20 వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తామని, ఇక్కడ చదువుకున్న పేద బిడ్డలు గర్వంగా తమ పాఠశాల పేరు చెప్పుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సంక్షేమం కోసం కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం, డైట్ ఛార్జీలను 40 శాతం పెంచినట్లు సీఎం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పాలు, రాగిజావతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తామని, కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని చెప్పారు. అలాగే రూ. 1,000 కోట్లతో ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని, ఈ వస్తువుల నాణ్యతను తానే స్వయంగా పరిశీలించానని పేర్కొన్నారు. 'విద్యార్థులకు నాణ్యత లేని వస్తువులను సరఫరా చేసే కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాదు.. వారిని బొక్కలో తోయించే బాధ్యత నాది అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచుతూ, వారికి ఒకటో తారీఖునే జీతాలు అందజేస్తున్నామని సీఎం చెప్పారు. 'టీచర్లకు ఇది కేవలం ఉద్యోగం కాదు.. అదొక బాధ్యత. 19 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు మీ చేతుల్లో ఉంది. పేద తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పనిచేయాలి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలు అనాథ శరణాలయాలు కావని, అవి అభివృద్ధి వేదికలని చాటిచెప్పేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి తెలిపారు.

# అభివృద్ధికి కేంద్ర సహకారం తప్పనిసరి

మొదటిపేజీ తరువాయి..

కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే' అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగు తున్నామని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని మోదీ సమావేశం కావడం ప్రైవేట్ కార్యక్రమమని చెప్పుకొచ్చారు. అలాగే తమతో కలిసి రావాలన్న ప్రధాని మోదీ పిలుపును స్వాగతిస్తున్నామని తెలిపారు. ప్రధాని అధికారిక కార్యక్రమంలో పాల్గొన్నానని, ఆయన పిలుపులో రాజకీయాలకు తావులేదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమంలో కేంద్రంతో కలిసి వెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. వికసిత్ భారత్‌లాగే విజన్ 2047 సాధనకు, 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అందుకునేందుకు కేంద్రంతో కలిసి నడుస్తామన్నారు. కేంద్రం, రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో ముందుకెళ్లాలని తెలిపారు. తమ పార్టీలు, ఐడియాలజీ వేరైనా.. అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తామన్నారు. ఎన్నోసార్లు కలిసినా.. కేంద్రం నుంచి ఆశించిన మద్దతు రాలేదని, 2 గంటలు సమయమిస్తే తమ ప్రణాళికలు ప్రధానికి వివరిస్తామని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మెట్రో, సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్ వంటి కొన్ని ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్‌లు, డిఫెన్స్ ల్యాండ్స్, మూసీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధులు, నేషనల్ హైవేలకు అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు. 2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని తాను ప్రధాని మోదీని కోరగా ఆయన అంగీకరించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీని 'బ్రిటిష్ జనతా పార్టీ'గా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. విభజించి పాలించడం ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. ముస్లింలు, క్రిస్టియన్లు, మావోయిస్టులు కూడా ఈ దేశ ప్రజలేనని, అందరికీ సమాన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఖతం చేయడం వాళ్ల విధానమని విమర్శించారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఒప్పించి జనజీవనంలో కలపడం కాంగ్రెస్ విధానమని వ్యాఖ్యానించారు. విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కేంద్రానికి స్పష్టమైన విధానం లేదన్నారు. జెమిని సర్కస్ లా బీజేపీ ఎన్నికల విధానం ఉంటుందని ఎద్దేవా చేశారు. అనుభవరాహిత్యం, అహంకారం వల్లనే దేశాన్నిసంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పశ్చిమబెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. కేరళంలో 3 సీట్లు, తమిళనాడులో ఒక సీటు మాత్రమే బీజేపీ గెలుచుకుందని ప్రస్తావించారు. ఏ రాష్ట్రంలో గెలవాలంటే అక్కడ ఎస్ఐఆర్‌ను ప్రయోగిస్తున్నారని ఫైర్ అయ్యారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రాలేదని.. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి ఏమిటని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రెండు సీట్లతో ప్రారంభమైందని..అక్కడికే వస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌ను మోదీ విమర్శిస్తే తనను విమర్శించినట్లేనని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు ఆశించిన మేరకు సహకారం లేదని చెప్పారు. బీజేపీకి ప్రజాస్వామ్యంపైన నమ్మకం లేదని మండిపడ్డారు. తమిళనాడులో అతిపెద్ద పార్టీకి ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ ఆహ్వానించకుండా నిర్లక్ష్యం ఎందుకు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ జపం చేయకుండా బీజేపీ బతకదని విమర్శించారు. తెలంగాణలో 818 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారని, దేశంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బుల్లెట్ కాదు బ్యాలెట్ అని కాంగ్రెస్ ఎప్పటి నుంచో చెబుతోందని, చివరకు మావోయిస్టులు కూడా అదే మార్గంలోకి వచ్చారని అన్నారు. మావోయిస్టుల లొంగుబాటుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. గణపతి వంటి నేతలు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. అవసరమైతే వైద్య సహాయం, ఆర్థిక సాయం కూడా అందిస్తామని తెలిపారు. దేశం కోసం కాంగ్రెస్ ప్రాణాలు ఇచ్చిందని ఉద్ఘాటించారు. రాజీవ్ గాంధీని చంపిన వాళ్లకు కూడా సోనియా గాంధీ క్షమాభిక్ష పెట్టారని ప్రస్తావించారు. ప్రధాని మోదీ మాట్లాడిన కొన్ని మాటలు దురదృష్టకరమని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణం చేయొద్దని ప్రజలకు చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. విదేశాంగ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రతిపక్షాల సూచనలు తీసుకోవాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కేంద్రానికి సూచించారు. మోదీ అనుభవరాహిత్యం, అహంకారం వల్ల దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌ను దేనికి సంబంధం లేకుండా అమలు చేయడానికి అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయొచ్చని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన 543 లోక్‌సభ సీట్లను దామాషా ప్రకారం చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. 50 శాతం పెంపు అనే దానికి కూడా ఎలాంటి ఫార్ములా లేదని చెప్పుకొచ్చారు. సీట్ల పెంపకంపైనే అందరికీ అభ్యంతరాలు ఉన్నాయని అన్నారు. జమిలి ఎన్నికలు 2029లో జరిగే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన కేసు విషయంపై కూడా సీఎం స్పందించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మే 8వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదైందని, ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్ల కారణంగా విచారణ ఆలస్యమైందని వివరించారు. ఇప్పుడు దర్యాప్తు వేగవంతం చేశామని, సిట్ ఏర్పాటు చేశామని.. సీనియర్ మహిళా అధికారిని విచారణాధికారిగా నియమించినట్లు చెప్పారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని.. ఎవరినీ ఇప్పటివరకు వదలిపెట్టలేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## సర్ ప్రక్రియపై సిఇవో సమీక్ష

మొదటిపేజీ తరువాయి..

కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం త్వరలో ప్రకటించనున్నందున, మ్యాపింగ్ పక్రియను మరింత వేగవంతం చేసి ఈ నెలాఖరు వరకు 90 శాతం పురోగతి సాధించాలని కలెక్టర్లు, అధికారులను ఆయన ఆదేశించారు. మ్యాపింగ్ కార్యక్రమానికి సహకరించేందుకు వివిధ రెసిడెన్షియల్ అసోసియేషన్లు , గేటెడ్ కమ్యూనిటీలను కలుపుకోవాలని, అలాగే ప్రభుత్వ ఉద్యోగులందరూ సంబంధిత బిఎల్‌వోలసంప్రదించి స్వచ్ఛందంగా మ్యాపింగ్ చేయించుకోవాలని సీఈఓ కోరారు. గేటెడ్ కమ్యూనిటీలు, స్లమ్ ప్రాంతాలను సందర్శించి, అక్కడి ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ మ్యాపింగ్ పక్రియను చేపట్టాలని ఆయన సూచించారు. ఓటర్లకు మ్యాపింగ్‌లో సహాయం అందించేందుకు సూపర్వైజర్ స్థాయి అధికారులు హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. అదేవిధంగా, స్వయం సహాయక సంఘాలు, రేషన్ షాప్ డీలర్లు, ఉద్యోగ సంఘాలను కూడా ఈ మ్యాపింగ్ పక్రియలో భాగస్వామ్యం చేయాలని కోరారు. మరణించిన, వలస వెళ్లిన, శాశ్వతంగా చిరునామా మార్చుకున్న ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, విధి విధానాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే తమ నియోజకవర్గాలలోని ÷ఎఎఖ, ÷ఎఎఖ ఓటర్ల మ్యాపింగ్‌ను కూడా చేపట్టాలని సూచించారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి, మ్యాపింగ్ పురోగతిని సమీక్షించేలా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సీఈఓ ఆదేశించారు. అనధికార వ్యక్తులతో ఎటువంటి సమాచారం పంచుకోవద్దని సీఈఓ హెచ్చరించారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇళ్లను లేదా ఓటర్లను గుర్తించడంలో మాత్రమే బిఎల్‌వోల సహాయం తీసుకోవాలని ఆయన చెప్పారు.

తప్పుగా జరిగిన మ్యాపింగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటిని తక్షణమే సరిచేయాలని ఆయన ఆదేశించారు. జిల్లా స్థాయిలో ముద్రిత, ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్లను కోరారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, నోడల్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజర్, సాంకేతిక సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి

మొదటిపేజీ తరువాయి..

కమిషన్‌కు ఛైర్ పర్సన్‌గా మాజీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని నియమించింది. అలాగే కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం పలువురు ప్రముఖ మహిళలకు అవకాశం కల్పించింది. ఈ నియామకాల్లో తెలంగాణ ఉద్యమం, సామాజిక సేవ, మహిళా హక్కుల ఉద్యమాల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతచారి తల్లి కాసోజు శంకరమ్మను మహిళా కమిషన్ సభ్యురాలిగా రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది.




తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీకాంతచారి త్యాగం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఈ నియామకంతో తెలంగాణ ఉద్యమ కుటుంబాలకు ప్రభుత్వం గౌరవం ఇచ్చినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేతను కూడా కమిషన్ సభ్యురాలిగా కాంగ్రెస్ సర్కార్ నియమించింది. చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆమె కుటుంబానికి ఈ నియామకంతో ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళా కమిషన్ సభ్యులుగా శశికళ యాదవ్ రెడ్డి, సదాలక్ష్మి, రాధాభాయి, ఉజ్మా షకీరాలను కూడా ప్రభుత్వం నియమించింది. వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా ఈ నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తోందని, మహిళల సమస్యల పరిష్కారంలో కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు.

## ఆరోగ్యశాఖలో 1919 నర్సింగ్ ఆఫీసర్ నియామకం

మొదటిపేజీ తరువాయి..

నియంత్రణ, పార్కింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న 1919 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తోంది. వీరితో పాటు లేబర్ డిపార్ట్‌మెంట్‌లో మరో 257 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను కూడా భర్తీ చేయనున్నారు. ఈ నియామక పక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు పారదర్శకంగా నియామక పత్రాలు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలో నర్సింగ్ రంగంలో భారీ స్థాయిలో ఉద్యోగావకాశాలు కల్పించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరతను తగ్గించేందుకు ఈ నియామకాలు కీలకంగా మారనున్నాయి. కొత్తగా నియమితులయ్యే నర్సింగ్ ఆఫీసర్లు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అందించనున్నారు. ఈ నియామకాలతో ప్రభుత్వ వైద్యసేవలు మరింత బలోపేతం అవుతాయని ఆరోగ్యశాఖ అధికారులు భావిస్తున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలను విస్తరించేందుకు కొత్తగా



నియమితులయ్యే నర్సింగ్ ఆఫీసర్లు ఉపయోగపడనున్నారని పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ నర్సెస్ డే సందర్భంగా ఈ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషంగా మారింది. కరోనా కాలంలో నర్సులు అందించిన సేవలను ప్రభుత్వం గుర్తు చేసుకుంటూ, ఆరోగ్యరంగంలో వారి పాత్ర ఎంతో గొప్పదని పేర్కొంది. ప్రజారోగ్య పరిరక్షణలో నర్సులు ముందుండి సేవలందిస్తున్నారని, వారి సేవలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

**CHANGE OF NAME**

I, Naresh Kumar. Ch S/o. Gangaiah Aged 42 years. R/o. H.No. 4-91, Rampur, Narsapur(G) Mandal, Dist. Nirmal, Telangana 504306, Have Changed My Name From Naresh kumar ch S /o. Gangaiah (Old Name) To **CHINOLLA NARESH** S/o. Gangaiah (New Name).

## ప్రజావాణిలో ప్రజల వినతులు స్వీకరణ

### సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ కృషి : అదనపు ఎస్పీ ఎన్‌బి రత్నం

మహబూబ్‌నగర్, మే 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల వినతులను అదనపు ఎస్పీ ఎన్‌బి రత్నం నేరుగా స్వీకరించి శ్రద్ధగా విన్నారు. ప్రజలు తమ సమస్యలను వివరించగా, వాటిని పరిశీలించిన అదనపు ఎస్పీ



సంబంధిత అధికారులతో వెంటనే ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతగా తీసుకుని బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ ఎన్‌బి రత్నం మాట్లాడుతూ, "ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి వేగవంతమైన పరిష్కారం చూపేందుకు ఒక వేదికగా పనిచేస్తోంది. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, ప్రజల్లో పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నాము" అని పేర్కొన్నారు.

## మిల్లుల వద్ద వరి లారీల అన్లోడింగ్ వేగవంతం చేయాలి

### - తరుగు పేరిట రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు : కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, మే 11 (ప్రజాజ్యోతి): వరి కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు చేరుతున్న ధాన్యం లారీలను వేగంగా అన్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మిల్లుల వద్ద లారీలు ఎక్కువసేపు నిలిపివేస్తే సంబంధిత వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తరుగు లేదా ఇతర కారణాల పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఒక రోజుకు మించి లారీలు వేచి ఉండకుండా తహసీల్దార్లు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని



సూచించారు. జనగణన–2027 హౌస్ లిస్టింగ్ ఏర్పాట్లపై కూడా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎన్యుమరేటర్లు మొదటి రెండు మూడు రోజులు తమకు కేటాయించిన హద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, జనగణన పూర్తిగా డిజిటల్ విధానంలో జరుగనున్నందున వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం వేళల్లోనే ఫీల్డ్ పర్యటనలు చేపట్టి వడదెబ్బ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్, సీపీఓ హరికృష్ణ, డీఆర్‌డీఓ ఉమాదేవి, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, సెన్సస్ ఛార్జ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

### - కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, మే 11 (ప్రజాజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు ఎన్ ఖీమ్యా నాయక్, వినోద్ కుమార్, జెడ్పీ సీఈవో యాదయ్యతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ



ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి సంబంధిత ఫిర్యాదుదారులకు సమాచారం అందించాలని సూచించారు. తమ శాఖ పరిధిలో లేని సమస్యలను సంబంధిత శాఖలకు పంపించాలని, పెండింగ్‌లో ఉంచొద్దని అధికారులను ఆదేశించారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన పెండింగ్ అర్జీలను కూడా త్వరగా పరిష్కరించాలని తెలిపారు. ప్రజావాణిలో మొత్తం 57 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

## పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు, మే 11 (ప్రజాజ్యోతి): శ్రీరంగాపురం మండలం వెంకటాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి తన వంతు సహాయంగా రూ.3



లక్షల విరాళాన్ని ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామ ఐక్యతను చాటిచెప్పుతాయని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# "ఐదు ప్రాణాలు పోవడానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణం"

- పాల్ కొండ బై పాస్ ప్రమాదంపై శ్రీనివాస్ గౌడ్ ఫైర్
- ట్రాఫిక్ నియంత్రణలో వైఫల్యంపై మాజీ మంత్రి తీవ్ర విమర్శలు

మహబూబ్‌నగర్, మే 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : పాలకొండ బైపాస్ రోడ్డులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ పోలీసు, మున్సిపల్ అధికారుల పనితీరును ఎండగట్టారు. ఐదుగురు ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటన అత్యంత బాధాకరమని పేర్కొంటూ, "బైక్ రైడర్లు అతి వేగంతో రోడ్డుపై చక్కర్లు కొడుతుంటే పోలీసులు ఏం చేస్తున్నట్లు..?" అంటూ ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రిలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ పోలీస్ వ్యవస్థకు మంచి పేరు ఉండేదని, ప్రస్తుతం కొంతమంది అవినీతి అధికారుల కారణంగా మొత్తం పోలీసు వ్యవస్థకే చెడ్డపేరు వస్తోందని విమర్శించారు. "ఇసుక, మట్టి లారీలు, భూముల సెటిల్మెంట్లపై ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాలపై కనిపించడం లేదు" అంటూ మండిపడ్డారు. పాలకొండ బైపాస్‌లో సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్, స్పీడ్ కంట్రోల్ వ్యవస్థలు ఏర్పాటు చేసి ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేదే కాదని ఆయన అన్నారు. గత ఎన్నికల ముందే ట్రాఫిక్ సిగ్నల్స్ కోసం నిధులు తీసుకొచ్చామని, వెంటనే వాటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలనలో రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్ వంటి పనులు చేపట్టామని గుర్తుచేశారు. బైపాస్‌లో ఎక్కడ పడితే అక్కడ డివైడర్లు ఓపెన్ చేయడం ప్రమాదాలకు దారితీస్తోందని,



మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు అభివృద్ధి పనులు చేసే కాంట్రాక్టర్ల నుంచి కమిషన్ల కోసం ఒత్తిడి చేయడం మానేసి ప్రజల ప్రాణాల రక్షణపై దృష్టి పెట్టాలని అధికారులకు హితవు పలికారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన జర్నలిస్ట్ లపై కేసులు పెట్టడంలో చూపుతున్న వేగం, ప్రమాదాల నివారణలో కనిపించడం లేదని మాజీ మంత్రి విమర్శించారు. "పకడ్బందీగా పోలీస్ వ్యవస్థ పని చేసి ఉంటే ఐదు మంది ప్రాణాలు నిలిచేవి" అని అన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడేందుకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని



అన్ని వసతులతో ప్రారంభించాలని, కేవలం జిల్లా ఆస్పత్రిని అక్కడికి మార్చడం సరైన పరిష్కారం కాదని పేర్కొన్నారు. ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. "ప్రజల పక్షాన మాట్లాడితే కొందరు రాజకీయంగా టార్గెట్ చేస్తున్నారు. కానీ ప్రజలు అన్నీ గమనిస్తున్నారు" అంటూ శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారు.

# బైపాస్‌పై బైక్ రేసింగ్ బీభత్సం.. అమాయకుల ప్రాణాలు బలి

- వేగం.. మద్యం.. నిర్లక్ష్యం
- పాలకొండ బైపాస్‌లో ఘోర ప్రమాదం – ఐదుగురు మృతి
- చర్యలు ఎక్కడ..? అధికారుల నిర్లక్షం పై సోషల్ మీడియాలో సెటైర్లు..
- గాలిలో ప్రజల ప్రాణాలు... ఏసి రూమ్ లలో అధికారుల ముచ్చట్లు...?

మహబూబ్‌నగర్, మే 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : మహబూబ్ నగర్ జిల్లాలో సంబంధిత శాఖల అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల రహదారుల పై ప్రమాదాల వల్ల రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రజల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి... ఆది వారం రాత్రి మహబూబ్‌నగర్ పాలకొండ బైపాస్ రోడ్డులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం జిల్లాలో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. అతి వేగంతో దూసుకొచ్చిన స్పోర్ట్స్ బైక్ ఓ కారును ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరితో పాటు కారులో ఉన్న ముగ్గురు చిన్నారులు, డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ప్రాథమిక సమాచారం ప్రకారం అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్య డ్రైవింగ్ ఈ ప్రమాదానికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టినా అప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. యువకుల నిర్లక్ష్యపు బైక్ రేసింగ్ సరదా ఐదుగురు




అమాయకుల ప్రాణాలను బలితీసుకుంది. మహబూబ్‌నగర్‌లో జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదం జిల్లాను విషాదంలో ముంచెత్తింది. పాలకొండ బైపాస్ రోడ్డుపై అత్యంత వేగంగా దూసుకొచ్చిన స్పోర్ట్స్ బైక్ కారు ఢీకొనడంతో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. సమాచారం ప్రకారం దాదాపు 140 కిలోమీటర్ల వేగంతో వచ్చిన బైక్ అదుపుతప్పి కారును ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన అర్షియ బేగం(30), ఉజేప(7), అమర్(2) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, బైక్‌పై ఉన్న హైదరాబాద్‌కు చెందిన యాకుబ్ అఫ్జల్(25)తో పాటు మరో వ్యక్తి కూడా మృతి చెందారు. ఈ ఘటనతో మహబూబ్‌నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ముఖ్యంగా బైపాస్ రోడ్డుపై రాత్రివేళల్లో జరుగుతున్న బైక్ రేసింగ్‌లపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, బైపాస్‌ను బైక్ రేసర్ల అడ్డాగా మార్చేశారని ఆరోపిస్తున్నారు. "ప్రతి రోజు రాత్రి స్పోర్ట్స్ బైక్‌లతో యువకులు బైపాస్‌పై రేసింగ్‌లు చేస్తుంటారు... చెవులు పగిలేలా శబ్దాలు చేస్తూ ప్రాణాలతో ఆటలాడుతుంటారు... పోలీసులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు" అంటూ స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా పాలకొండ బైపాస్ రోడ్డుపై కొంతమంది యువకులు నిత్యం స్పోర్ట్స్ బైక్‌లతో రేసింగ్‌లు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో బైక్ స్టంట్లు, అతి వేగంతో రేసులు పెరిగిపోవడంతో సాధారణ ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారని చెబుతున్నారు. ప్రజలు ప్రయాణించే ప్రధాన రహదారిని రేసింగ్ ట్రాక్‌లా మార్చడం వల్ల అమాయకుల ప్రాణాలు బలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకొండ బైపాస్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. వేగ నియంత్రణ చర్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, సీసీ కెమెరాలు, హెచ్చరిక బోర్డులు, పోలీసు నిఘా పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన అనంతరం సోషల్ మీడియాలో కూడా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "పాలమూరు బైపాస్‌లలో వరుస ప్రమాదాలు జరుగుతున్నా గట్టి చర్యలు కనిపించడం లేదు" అంటూ నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. "ఒక్కరి నిర్లక్ష్యం... ఎన్నో కుటుంబాల జీవితాలను చీకటిలోకి నెట్టింది" అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల ఫ్రెష్ మీట్ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి డివైడర్ ను ఏర్పాటు చేశారు కాని ఇందులో ఫ్రెష్ మీట్ అనే వ్యాపార సంస్థకు అనుకూలంగా వుండడం కోసమే ఈ స్థలంలో డివైడర్ ను ఏర్పాటు చేశారు అని ఆరోపణలు వచ్చాయి.a

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు,సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల మే 11(ప్రజా జ్యోతి ప్రతినిధి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు,సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని,ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99రోజుల షెడ్యూల్‌లో భాగంగా సోమవారం నుంచి నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ముఖ్య అతిథులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.అలాగే క్యారమ్స్, చెస్,నృత్యం,హ్యాండ్‌రైటింగ్,చిత్రలేఖనం తదితర అంశాల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి





శిక్షణ శిబిరాలను ప్రారంభించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయడమే లక్ష్యంగా విద్యా వారోత్సవాల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.2026–27 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందించడంతో పాటు,జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ,ప్రభుత్వ విద్యాసంస్థల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.విద్యా వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలు,కళాశాలల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పూర్తయిన నిర్మాణాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, తెలంగాణ మోడల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి,వైస్ చైర్మన్ శంకర్,గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు,పీఏసీఎస్ చైర్మన్ సుభాన్,స్థానిక కౌన్సిలర్ బంగి ప్రియాంక, డీఈవో విజయలక్ష్మి,ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుకాదేవి,ప్రజా ప్రతినిధులు,అధికారులు,ఉపాధ్యాయులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచరాదు:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల మే 11(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా,మండల స్థాయిలోనే సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు



మధు మోహన్,నర్సింగరావుతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.ఎండార్స్‌మెంట్ తదితర అంశాలపై ప్రజలు అధికంగా ఫిర్యాదులు చేస్తున్నారని,సంబంధిత రెవెన్యూ అధికారులు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తే ప్రజలు కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం ఉండదని అన్నారు.ఈ వారం ప్రజావాణికి మొత్తం 69 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ,సెన్సస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.సంబంధిత చార్జ్ అధికారులు బ్లాక్‌ల వారీగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.పీఎండీడీకేవై పథకం అమలులో అధికారులు నిబద్ధతతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ నెల 12న ఉన్నతాధికారులు పథకం అమలుపై సమీక్షించేందుకు,క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు గద్వాలకు రానున్నందున,లైన్ డిపార్ట్మెంట్ అధికారులు అవసరమైన సమాచారంతో సిద్ధంగా ఉండాలని సూచించారు.ధాన్యం కొనుగోలు



కేంద్రాలను సజావుగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.అలాగే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

## పోక్సో కేసులో నిష్పక్షపాత విచారణ జరపాలి

### - కేంద్ర మంత్రి కుమారుడిపై ఆరోపణల నేపథ్యంలో తక్షణ చర్యలకు డిమాండ్

మహబూబ్‌నగర్ / హైదరాబాద్, మే 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం



ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు వివరాల ప్రకారం, ఓ ఫామ్‌హౌస్‌లో మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై స్పందించిన పలువురు ప్రజాసంఘాల నాయకులు, మహిళా సంఘాలు చట్టం ముందు అందరూ సమానులేననే రాజ్యాంగ స్ఫూర్తిని ప్రభుత్వం నిలబెట్టాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు పలు ప్రధాన డిమాండ్లు వెల్లడించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదైన నేపథ్యంలో నిందితుడు ఎంతటి ప్రభావవంతమైన వ్యక్తి అయినా తక్షణ అరెస్టు చేసి పారదర్శక విచారణ జరపాలని కోరారు. అలాగే బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులకు పూర్తిస్థాయిలో పోలీసు రక్షణ కల్పించి ఎటువంటి బెదిరింపులు, ఒత్తిళ్లు రాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఒక బాధ్యతాయుతమైన కేంద్ర మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి తన కుమారుడిపై ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు వచ్చినప్పుడు నైతిక బాధ్యత వహించాలని, అధికార ప్రభావంతో విచారణను మళ్లించే ప్రయత్నాలు చేయకూడదని పేర్కొన్నారు.

ఈ కేసు దర్యాప్తు పురోగతిని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని, కేసును పక్కదారి పట్టించే ప్రయత్నాలు జరిగితే తీవ్రంగా వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బాధితురాలికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## గద్వాల సీనియర్ జర్నలిస్టు డేవిడ్ రాజు మృతి

గద్వాల మే 11(ప్రజా జ్యోతి):జోగులాంబ గద్వాల జిల్లా సీనియర్ జర్నలిస్టు కే.డేవిడ్ రాజ్ (61) సోమవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా ఛాతి నొప్పి రావడంతో మరణించినట్లు ఆయన కుమారుడు తెలిపారు.గత 30 ఏళ్లుగా ఆంధ్రప్రభ ఇతర దినపత్రికలలో పనిచేసి సీనియర్ జర్నలిస్టుగా కొనసాగుతున్నారు.డేవిడ్ రాజుకు భార్య ఇద్దరు కుమారులు



కాగా భార్య,పెద్ద కుమారుడు గత 10 సంవత్సరాల క్రితం మరణించారు.రాజు మృతి పట్ల జర్నలిస్టు సంఘాలు సంతాపం వెలిబుచ్చాయి.

## మాతృమూర్తితో కలిసి మాతృ దినోత్సవాన్ని జరుపుకున్న బీసీ సంక్షేమ సంఘం

### వరంగల్ జిల్లా అధ్యక్షులు ద్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**నర్సంపేట మే 11 (ప్రజా జ్యోతి) :** అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ ద్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ తన మాతృమూర్తి ద్యాగల రమణమ్మ తో కలిసి మాతృ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ద్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే నెల రెండవ ఆదివారం ఘనంగా జరుపుకునే మాతృ దినోత్సవాన్ని (మధర్స్ డే) ను పురస్కరించుకుని ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో మా అమ్మ ద్యాగల రమణమ్మ గారిని నా నివాసంలో తల్లి సమానులైన వారిని ఆహ్వానించి అమ్మను శాలువాతో సత్కరించుకుని కేకు కట్ చేయించిన అనంతరం అందరి సమక్షంలో దంపతులము అమ్మ ఆశీస్సులు తీసుకుని అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ద్యాగల శ్రీనివాస్ అన్నారు. అనంతరం మాతృ సమానులైన దూదిమట్ల కొమురమ్మ, దూదిమట్ల వీరలక్ష్మి, ఎంగళ సరోజన, ఎద్దు కొంరుమల్లమ్మ లను అమ్మ చేతుల మీదుగా శాలువాలతో సన్మానం చేయడం జరిగిందని తెలిపారు.

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, మే 11 (ప్రజాజ్యోతి) :** ప్రజావాణిలో వివిధ సమస్యలతో వచ్చే ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా 190 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ, ప్రజా సమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, పెండింగ్ లో లేకుండా దరఖాస్తులను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్షాలోమ్, జెడ్పీ సీఈవో రంగా రావు, జనగామ మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, సీపీఓ చిన కోట్యా నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్ ను కలిసిన ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు

### రైస్ మిల్లర్స్ సమస్యలు వివరించిన జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** ములుగు జిల్లా నూతన కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావును సోమవారం ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాధం ప్రవీణ్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుకు అభినందనలు తెలియజేసి, శాలువాతో సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో రైస్ మిల్లర్స్ సమస్యలను వివరంగా వినిపించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాధం ప్రవీణ్ రైస్ మిల్లర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే వారి సమస్యలను సానుకూలంగా స్పందించి, అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి సహోదర్ రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఉపాధ్యక్షుడు కాసిడి సుదర్శన్ రెడ్డి, సహాయ కార్యదర్శి దేగల భద్రయ్య, గౌరవ సలహాదారులు రామిని శ్రవణ్ కుమార్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ క్లాస్‌రూమ్‌ల ప్రారంభంతో విద్యా వారోత్సవాలకు శ్రీకారం



**మరిపెడ, మే 11 (ప్రజాజ్యోతి) :** మరిపెడ పట్టణంలోని ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యా వారోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్‌రూమ్‌లను ప్రారంభించారు. విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్య అందించేందుకు డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఎంతో ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన సౌకర్యాల కల్పన దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ సునీత రవీందర్ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ కుమార్‌తో పాటు అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు విద్యా ప్రగతికి సంబంధించిన పలు అంశాలను ప్రదర్శించారు. విద్యా వారోత్సవాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, సాంకేతిక అవగాహన పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు.

## 16న టీయూడబ్ల్యూజె (ఐజేయూ) హనుమకొండ జిల్లా మహాసభ..





### విజయవంతం చేయాలని రాష్ట్ర, జిల్లా నాయకుల పిలుపు..

**హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 11, (ప్రజాజ్యోతి) :** ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) అనుబంధ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజె) హనుమకొండ జిల్లా మహాసభ ఈ నెల 16న ఉదయం 10:30 గంటలకుహనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణలో నిర్వహించనున్నట్లు టీయూడబ్ల్యూజె జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్ తెలిపారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో టీయూడబ్ల్యూజె హనుమకొండ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభకు వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, టీయూడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విరాహత్ అలీ, రామ్ నారాయణ తదితరులు హాజరు కానున్నట్లు వారు తెలిపారు. జర్నలిస్టుల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజె ముందు వరుసలో నిలిచిందని, ప్రస్తుతం కొనసాగుతున్న అక్రిడిటేషన్ ప్రక్రియలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ వచ్చే కృషి చేస్తున్నదని చెప్పారు. గత మహాసభ నుండి నేటివరకు జిల్లాలో టీయూడబ్ల్యూజె అనేక కార్యక్రమాలు నిర్వహించి జర్నలిస్టుల మన్ననలు పొందిందని, రానున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మరింతగా కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా 16న జరిగే మహాసభకు అధిక సంఖ్యలో జర్నలిస్టులను తరలించాలని, ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా సీనియర్ జర్నలిస్టు, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు పివి మదన్ మోహన్ ఎంపిక తదితర పలు తీర్మానాలు సమావేశంలో ఆమోదించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు గడ్డం కేశవ మూర్తి, పిన్నా శివకుమార్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, జిల్లా యూనియన్ ఉపాధ్యక్షులు ఎంఏ. నయీం, డాక్టర్ పొడి శెట్టి విష్ణు వర్ధన్, ఉట్కూరి సాయిరాం, కోశాధికారి బచ్చు పురుషోత్తం, నాయకులు గన్ను సంతోష్, ముదిగిరి ఓదెలు, పులికంటి రాజేందర్, కె.ఆదిరెడ్డి, వాజీద్, దండు మోహన్, గడ్డం బాలరాజు, ఖాదర్ పాషా, అల్లె రామారావు, ఎర్రోల్ల జగన్, తాళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి..





**హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 11, (ప్రజాజ్యోతి) :** విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతి, ఆహార సదుపాయాలు నాణ్యతతో ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. హనుమకొండ సుబేదారిలోని గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ బాలుర కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని కిచెన్ షెడ్, ఆర్వో వాటర్ ప్లాంట్, టాయిలెట్లు, డార్మెటరీలను పరిశీలించి, నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు.

అనంతరం స్టోర్‌రూమ్‌లో నిల్వ ఉంచిన కూరగాయలు, పప్పులు, బియ్యం తదితర ఆహార పదార్థాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, స్టోర్‌లో ఉన్న నిల్వలు రికార్డుల్లో నమోదైన వివరాల మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే పప్పు దినుసులు, ఇతర ఆహార పదార్థాల నిర్వహణ సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత వార్డెన్ హాల్ సింగ్‌కు నోటీసు జారీ చేయాలని డీటీడీవో ప్రేమకళను ఆదేశించారు. హాస్టల్‌లో నివసిస్తున్న విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఏ కళాశాలలో చదువుతున్నారు, భోజనం మరియు స్నాక్స్ సమయానికి అందుతున్నాయా, ఆహార నాణ్యత ఎలా ఉందనే అంశాలపై ఆరా తీశారు. అదేవిధంగా వారానికి ఎన్నిసార్లు చికెన్, మటన్, గుడ్లు అందిస్తున్నారో వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులకు మెరుగైన వసతి, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని అధికారులకు అన్నారు. విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## మండల టాపర్లకు ఘన సన్మానం

### మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా విద్యార్థినిలకు పురస్కారాలు





**పర్వతగిరి, మే 11 (ప్రజాజ్యోతి) :** మండలంలోని జమాల్పురం గ్రామ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల/కళాశాలకు చెందిన విద్యార్థినిలు విద్యా ఫలితాల్లో ప్రతిభ కనబరిచి మండలానికి గర్వకారణంగా నిలిచారు. పదో తరగతి పరీక్షల్లో భూక్య నవ్య 600 మార్కులకు గాను 569 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానం దక్కించుకోగా, ఇంటర్ సెకండ్ ఇయర్‌లో జి. త్రిష 1000 మార్కులకు గాను 986 మార్కులు సాధించి విశిష్ట ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా పర్యావరణ, అటవీ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, కుడా చైర్మన్ వెంకటరాం రెడ్డి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద చేతుల మీదుగా విద్యార్థినిలను ఘనంగా సత్కరించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించిన యంగ్ అచీవర్స్ సన్మాన కార్యక్రమంలో భాగంగా శాలువాలు కప్పి సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ విషయాన్ని పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ శైలజారాణి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా తమ విద్యాసంస్థకు మంచి గుర్తింపు తీసుకొచ్చిన విద్యార్థినిలను పాఠశాల తరఫున అభినందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల విజయాల పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## లేబర్ కోడ్ రద్దుకు కార్మికులు ఐక్య పోరాటం చేయాలి

### సీఐటీయూ మండల నాయకులు కొండ ఉప్పలయ్య



**మరిపెడ, మే 11 (ప్రజాజ్యోతి) :** కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులకు విఘాతం కలిగించే విధంగా ఉన్నాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మరిపెడ మండల నాయకులు కొండ ఉప్పలయ్య డిమాండ్ చేశారు. లేబర్ కోడ్ రద్దు అయ్యే వరకు కార్మికులు ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక జీవోకు నిరసనగా సోమవారం మరిపెడ మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జీవో ప్రతులను దగ్ధం చేసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ ఉప్పలయ్య మాట్లాడుతూ..దేశంలో అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను కార్మిక సంఘాలతో చర్చించకుండా, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం దురదృష్టకరమన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన కార్మిక హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ కేంద్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని పక్కనబెట్టి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమ ప్రయోజనాలు దెబ్బతింటాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వర్గంపై కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగే పోరాటాల్లో ప్రతి కార్మికుడు ఐక్యంగా పాల్గొని ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ఉప్పలయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు కొండ వెంకన్న, సురబోయిన బిక్షం, జినక సైదులు, హేమ, శ్రీను, జామ్ల మంగమ్మ, లక్ష్మి, మల్లయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సంపేటలో విద్యార్థుల కోసం ప్రత్యేక వేసవి శిబిరాలు ఏర్పాటు

### ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్



**నర్సంపేట మే 11 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేసవిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేక సమ్మర్ క్యాంప్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. నర్సంపేట పట్టణంలోని, జడ్.పి.హెచ్.ఎస్ గర్ల్స్ హై స్కూల్ నందు సమ్మర్ క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొనీ సమ్మర్ క్యాంపును ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో విద్యార్థుల కోసం ఆటపాటలు, క్లాసికల్ డాన్స్, కుట్లు, పెయింటింగ్, యోగా సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు వేసవి సెలవులను సరదాగా, విజ్ఞానదాయకంగా మార్చుకోవడానికి తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ క్యాంపులకు పంపాలని అన్నారు. విద్యార్థులు ఈ ఉచిత వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ హై స్కూల్ హెడ్మాస్టర్, కాంతారావు, సీనియర్ ఉపాధ్యాయులు అరుణ కుమారి, రాజేష్, పీటీ కందుల, సెమీ, రమేష్, మల్లయ్య, వాణి, సురష్ కుమార్, మ్యూజికల్ టీచర్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు..

### హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ మూసా మొహమ్మద్



**పర్వతగిరి, 11 (ప్రజాజ్యోతి) :** పర్వతగిరి పీహెచ్‌సీ పరిధిలోని అన్నారం సబ్ సెంటర్‌ను హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ మూసా మొహమ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య సేవలు, మందుల లభ్యత, రికార్డులు, శుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సమయానికి మందులు అందించాలని, గర్భిణీలకు మెరుగైన ప్రసూతి సేవలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్, డ్రై డే--ఫ్రై డే కార్యక్రమాలు, ఎల్ఎంపీ సర్వేను విధిగా నిర్వహించాలని ఆదేశించారు.

## వెంకటేశ్వర పల్లిలో 100 మంది హనుమాన్ భక్తులకు అన్నప్రాసనం

### ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



**రాయపర్తి మే 11 ప్రజాజ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఉమ్మడి సన్నూర్ గ్రామములోనీ వెంకటేశ్వర పెల్లి గ్రామంలో హనుమాన్ భక్తులకు రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు సోమవారం మహా అన్నప్రాసనం (అన్నదానం)ఏర్పాటు చేసిన ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరపల్లి గ్రామంలోస్థానిక హనుమాన్ భక్తుల విన్నపం మేరకు హనుమాన్ భక్తులకు ఈ రోజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి సన్నూర్ పరిధిలోని సుమారు 100 మంది,హనుమాన్ భక్తులకు మహా అన్నప్రాసనం కార్యక్రమంను ఏర్పాటు చేసినరూ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి. ఈ రోజు కార్యక్రమంను ప్రారంభించిన రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, సర్పంచ్ చిన్నపాక రజిత రాంబాబు, పార్టీ ముఖ్య నాయకులు పోతుల కొమురుమాళ్ళు, పొన్నం కుమార్, ఆంజనేయభక్తులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ భూముల సర్వే పూర్తి...

### ఆక్రమిత 1 ఎకరం 30 గుంటలు వెలికితీత



**మరిపెడ, మే 11 (ప్రజాజ్యోతి) :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని గుండేపూడి గ్రామ శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి చెందిన భూముల సర్వే సోమవారం అధికారుల సమక్షంలో నిర్వహించారు. దేవాలయ భూములకు సంబంధించిన సర్వే నంబర్లు 348,374,375,376, 379 పరిధిలో ఉన్న మొత్తం 8ఎకరాలు 13 గుంటల భూమిని సర్వే చేసి హద్దు రాళ్లు ఏర్పాటు చేశారు. ఈ సర్వే సందర్భంగా అన్యాక్రాంతానికి గురైన దేవాలయ భూమిలో 1 ఎకరం 30 గుంటలను గుర్తించి తిరిగి వెలికితీశారు. అనంతరం సంబంధిత భూములకు స్పష్టమైన హద్దులు నిర్ణయించి రాళ్లు పాతారు. దేవాదాయ శాఖ అధికారులు హెచ్చరిస్తూ, ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను ఎవరైనా తొలగించినా లేదా భూమిని మళ్లీ ఆక్రమించేందుకు ప్రయత్నించినా దేవాదాయ శాఖ చట్టం 30/87 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మరిపెడ ఎస్ఐ గంద్రాతి సతీష్, దేవాదాయ శాఖ పరిశీలకులు శ్రీమతి నందనం కవిత, దేవాదాయ శాఖ సర్వేయర్ పి.అనిల్, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు, దేవాలయ సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్ శేఖర్, ఎన్‌డబ్ల్యూ కాలు, ఆర్ అసిస్టెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్ట్ షాపులు నిర్మూలించాలని తీర్మానం

నాంపల్లి,మే,11(ప్రజాజ్యోతి): మండలంలోని పస్నూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ కాశిమల్ల గోవర్ధన్ అధ్యక్షతన బెల్టు షాపులు మరియు నాటుసారాయి దుకాణాలు నిర్మూలన చేయాలనీ గ్రామ సభలో అందరి సమక్షంలో తీర్మానించడం జరిగింది.ఈ




సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం విచ్చలవిడిగా బెల్టు షాపుల్లో లభిస్తుండడంతో స్థానిక యువకులు మద్యానికి బానిసలవుతున్నట్లు తెలిపారు. పలువురు రోగాలు, ప్రమాదాల భారిన పడుతున్నట్లు వెల్లడించారు. నాటుసారా, మద్యం వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని మండి పడ్డారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా మద్యం మరియు నాటుసారాయి అమ్మితే 10 వేల రూపాయలు జరిమానా మరియు చట్టభద్ధంగా చర్యలు తప్పవు అన్నారు. ఈ నెల 18 నుండి గ్రామంలో పూర్తిగా బెల్టు షాపులు, నాటుసారాయి నిర్మూలన చేసి గ్రామ అభివృద్ధికి సహకరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాశిమల్ల గోవర్ధన్, ఉప సర్పంచ్ దండిగా ఆంజనేయులు, వార్డ్ సభ్యులు, గ్రామ సెక్రెటరీ, యువ నాయకుడు వీరమల్ల సందీప్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల కల్లాల వద్ద ధాన్యం కొనుగోలుకు అనుమతించాలి

మోత్కూరు, మే 11 (ప్రజా జ్యోతి): ధాన్యం కొనుగోలు ఆలస్యాన్ని నివారించడానికి రైతుల కల్లాల వద్ద కొనుగోలుకు అనుమతించాలని బిజెపి పట్టణ మాజీ అధ్యక్షులు పోచం సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల రోజులుగా వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు ఆలస్యం కావడంవల్ల మార్కెట్లో పూర్తిగా ధాన్యం కుప్పలు ఉండడం వల్ల ధాన్యము ఆరబోయడానికి అవకాశం లేనందున మ్యాచర్ సరిగా రాకపోవడం, తాలు తీసి వేయడం, హమాలీల కొరత, వాహనాల కొరత వల్ల ధాన్యం కొనుగోలు ఇంకా రెండు నెలలైనా



పూర్తి అయ్యే పరిస్థితి లేదన్నారు. అకాల వర్షం వస్తే మార్కెట్లో ధాన్యం కుప్పలను పక్కకు జరిపే స్థలము లేనందున తీవ్ర నష్టం ఏర్పడే అవకాశం ఉందని, దీనిని నివారించడానికి రైతుల వద్దనే ధాన్యం కొనుగోలుకు అనుమతి ఇస్తే నాణ్యత ప్రమాణాలు పాటించిన రైతుల వద్ద అధికారులు ధ్రువీకరించిన ధాన్యానికి బన్నీ బ్యాగులు ఇస్తే రైతులే కాంటాలు వేసి సొంత వాహనాల్లో రైస్ మిల్లర్ల దగ్గరికి తీసుకుపోయే అవకాశం ఉన్నదని తెలిపారు. ఈ విధానం వల్ల ధాన్యము తొందరగా రైస్ మిల్లర్ల వద్దకు చేరే అవకాశం ఉన్నందున సంబంధిత ప్రజా ప్రతినిధులు అయిన స్థానిక ఏఎంసి, పిఎసిఎస్ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని ఉన్నత అధికారులతో మాట్లాడి కొనుగోలుకు అనుమతి ఇప్పించాలని కోరారు.

## కొక్కుల ఉషశ్రీకి అభినందనలు

మోత్కూరు, మే 11 (ప్రజా జ్యోతి): ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మోత్కూర్ జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థిని కొక్కుల ఉషశ్రీని తెలంగాణ భాషా సాంస్కృతిక సంచాలకులు లు డాక్టర్



ఏనుగు నరసింహారెడ్డి అభినందించారు. సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన మహాత్మ జ్యోతిరావు పూలే ప్రతిభా పురస్కారాల కార్యక్రమం సంధర్భంగా తన కార్యాలయంలో శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువును ఇష్టపడి చదవాలని, ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవినేని అరవిందరాయుడు, ఉపాధ్యాయులు తౌర్ర ఉప్పలయ్య, విద్యార్థిని తండ్రి కొక్కుల రమేష్ ఉన్నారు.

## ద్విచక్ర వాహనం డి వ్యక్తి మృతి

చిట్యాల మే 11(ప్రజాజ్యోతి ప్రతినిధి): చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాతరాజు గణేష్ (52) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాళ్లసింగారం గ్రామానికి చెందిన మృతుడు ఆదివారం సాయంత్రం పెద్దకాపర్తిలో జరిగిన ఒక వేడుకకు హాజరయ్యారు. వేడుక అనంతరం టి యస్ 30 డి 0761 నెంబర్ గల ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి



బయలుదేరారు.పెద్దకాపర్తి పరిధిలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద పెట్రోల్ పోయించుకుని వెళ్తుండగా గురిజ వంశీ అనే వ్యక్తి టి యస్ 05 యఫ్ ఇ 8559 నెంబర్ గల తన ద్విచక్ర వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ స్కూటీని బలంగా ఢీకొట్టడంతో ప్రమాదంలో మృతుడు రోడ్డుపై పడిపోయి తీవ్ర రక్తగాయాలకు గురయ్యారు. స్థానికులు ఆయనను వెంటనే నార్కెట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించారు.అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే గణేష్ మరణించారు. ఈ ఘటనపై మృతుని అన్న కుమారుడు బాతరాజు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ రవి కుమార్ తెలి పారు.

## తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి : సిపిఎం నేతల డిమాండ్

సంస్థాన్ నారాయణపురం, మే 11, (ప్రజాజ్యోతి) : అకాల వర్షానికి తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి శ్రీనివాసచారి డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి భారీ గాలివాన రావడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉన్న దాన్యమంతా తడిసిపోయింది. గాలికి టార్పాలిన్లు లేచి గాలికి ఎగిరిపోయాయి. ధన్యమంతా తడిసి కొట్టుకపోయింది. సోమవారం మండలంలోని పలు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిపిఎం పార్టీ రైతు సంఘం ఆధ్వర్యంలో పరిశీలించారు. ప్రభుత్వం ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయకపోవడం వలన వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నెలల తరబడి అని తూకం వేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. అకాల వర్షానికి బస్తాలు నింపిన ధాన్యంతో పాటు నేలపై నిల్వ చేసిన ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసిపోయి నష్టపోతున్నారని వివరించారు. ప్రభుత్వం షరతులు లేకుండానే



ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు దోనూరు నర్సిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి యాదిరెడ్డి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు తుమ్మల నర్సిరెడ్డి, మల్లేపల్లి లలిత, మండల కార్యదర్శి కొమ్ము మల్లేశం, చింతకాయల నరసింహ, మల్లేపల్లి జంగారెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణ, కిరణ్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పాటిమట్లను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా !

### తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, మే 11 (ప్రజా జ్యోతి): పాటిమట్ల గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. పాటిమట్ల గ్రామంలో ఈ నెల 23 , 24 తేదీలలో పెద్ద మైసమ్మ పండుగ



చేయడానికి నిర్ణయించినందున పాటిమట్ల గ్రామంలోని దళిత వాడకి సోమవారం విచ్చేసి కుల పెద్ద మనుషులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పైలెట్ ప్రాజెక్టుగా పాటిమట్ల గ్రామాన్ని తీసుకొని తగిన నిధులు మంజూరు చేసి అన్ని రంగాలలో అభివృద్ధిలో ముందు ఉంచుతానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యేకు లిఖితపూర్వకంగా రాసి చదివి వినిపించి అనంతరం వినతి పత్రం అందజేశారు.

ఎస్సీ కులానికి చెందిన వారికి రైతులకు ప్రత్యేకంగా ఒక ట్రాన్స్ ఫార్మర్ ఇప్పించి, లూజ్ లైన్ క్రింద 6 విద్యుత్ స్తంభాలు మంజూరి చేయించాలని, పాటిమట్ల గ్రామం నుండి ఎక్స్ రోడ్ వరకు చెరువు కట్ట కింద సల్లోని భావి, కుమ్మరి బావి ల వద్ద రక్షణ గోడలు నిర్మించాలని, ఇందిరమ్మ ఇళ్లలో దళితులకు క్రైటీరియా ప్రకారం ఎక్కువ శాతం ఇండ్లు మంజూరు చేయించాలని, ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభించాలని, సదర్శాపురం రోడ్ కు బృందావన్ కాలువ మీద కల్వర్టు నిర్మించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండ రమ విజయ రెడ్డి, తాసిల్దార్ పి.జ్యోతి, ఎంపీడీవో డి. బాలాజీ నాయక్, సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, దళిత కాలనీ కుల పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి లో భువనగిరి మున్సిపాలిటీ అధికారుల డుమ్మ

భువనగిరి,మే 11 (ప్రజాజ్యోతి) ప్రజావాణిలో వచ్చిన దరఖా స్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని రాజస్వం మండలాధికారి






భువనగిరి అన్నారు.సోమవారం రోజు రాజస్వ,మండలాదధికారి భువనగిరి,సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో యం. క్రిష్ణా రెడ్డి, రాజస్వ మండల ఆధికారి,వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 14 అర్జీలను స్వీకరించారు.ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటిక ప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిం చాలన్నారు.అందులో రెవిన్యూ శాఖకి సంబదించి మొత్తం 14 అప్లికేషన్ లు వచ్చాయి, జరిగింది,రెవెన్యూ శాఖకి సంబందిచి 14,మండలా వారిగా వచ్చిన ఆలేరు –5, భువనగిరి –4 బీబీనగర్ –2,తుర్కపల్లి–1 మోటకొండూర్– 1,భువనగిరి (మున్సిపల్ )–1,అప్లికేషన్ వచ్చాయని తెలియ జేశారు.ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతు ప్రజల నుండి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కారం చేయాలనీ అధికారులను ఆదేశించారు.అదే విధంగా కేవలం రెవిన్యూ శాఖ నే కాకుండ,అన్ని శాఖల అధికారులు క్రమం తప్పకుండ గ్రీవెన్స్ లో హాజరు కావాలని అన్నారు. ఒకవేళ ఎవరైనా అలసత్వం వహిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ డి.ఎ.ఓ పి.రాధ మరియు వివిధ శాఖల డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, మే 11(ప్రజాజ్యోతి): నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



సోమవారం నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి, నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట మండలాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరు, రోజువారీ కొనుగోళ్లు, ధాన్యం రైస్ మిల్లులకు తరలింపు, రైతులకు చెల్లింపుల పరిస్థితిపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ఆలస్యం లేకుండా రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. గన్నీ బ్యాగులు, తేమ కొలిచే మీటర్లు, తూకం యంత్రాలు అందుబాటులో ఉండి సక్రమంగా పనిచేసేలా చూడాలని సూచించారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతు కష్టానికి తగిన గౌరవం దక్కేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు 48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏ రైతుకూ అన్యాయం జరగకుండా చూడటం అందరి బాధ్యత అని స్పష్టం చేశారు. సమీక్ష సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు, వివిధ మండలాల తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ ఏడీలు, ఏవోలు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, ఐకేపీ, ప్యాక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యే సమాజ అభివృద్ధికి మూలాధారం: ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, మే 11(ప్రజాజ్యోతి): ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నకిరేకల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం ముఖ్య



అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ విద్య సమాజ పురోగతికి ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తోందని తెలిపారు.

అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కృషి చేస్తున్న ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మానవ జీవితంలో యోగా ఎంతో అవసరం

### జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

నల్లగొండ, మే 11, (ప్రజా జ్యోతి) సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వైదిక యోగ పీట్ కరుణాకర్ గురుజీ రూపొందించిన యోగాసనాలు పుస్తకాన్ని



నల్గొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆవిష్కరించి మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే యోగ పట్ల అవగాహనతో పాటు నిత్య యోగ సాధన చేయడం ద్వారా మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండి వ్యాధులకు దూరంగా ఉండవచ్చు అని అన్నారు. యోగాసనాల చిత్రాలతో పాటు వాటి ప్రాధాన్యత, ఎలాంటి ఆసనాలు ఎవరు చేయాలి ఎవరు చేయకూడదు అనే విషయాలను క్రోడీకరిస్తూ సమగ్ర సారాంశాలను ఈ పుస్తకాలను రూపొందించడం ద్వారా ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎం శ్రీ యోగ టీచర్లు మంజునాథ్, జానీ, కర్నాటి శ్రీహరి, విజయ, జ్యోతి, శకుంతల, పావని వెంకట్, ప్రసాద్, మధు, శ్రీనివాస్, సంధ్య రాణి, ప్రవీణ్, జయశ్రీ, హరితరాణి, నాగజ్యోతి, సుజిత, లీలా కుమారి, దివ్య, మృదుల, వెంకటయ్య, యాదమ్మ, కోమల, వైష్ణవి, లీలా కుమారి, భారతి, నరేష్, సోమేశ్వరి, గాయత్రి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మనూతన గృహంలో సుఖశాంతులతో ఉండాలి -ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్ పల్లి, మే 11 ( ప్రజా జ్యోతి ): పట్టణానికి చెందిన ఎస్కే రఫీ గారి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ మహోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాన్ని సందర్శించి,కుటుంబ సభ్యులకు పూలు, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన గృహంలో సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్యతర గతి కుటుంబాల సొంతింటి కల సాకారమవుతోంది. ఇల్లు లేని నిరుపేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో, గర్వంగా జీవించేలా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తోంది" అని పేర్కొన్నారు. లబ్ధిదారు ఎస్కే రఫీ కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మఇల్లు రావడంతో మా చిరకాల స్వప్నం నెరవేరింది అని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జేరిపోతుల భరత్ గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు బత్తుల ఊశయ్య పాల్గొన్నారు



### భవిష్యత్ రైతాంగ పోరాటాల నిర్మాణం

# కోసమే ఏఐయు కెఎస్ జాతీయ మహాసభలు

- సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ వెల్లడి



**సిరికొండ ( ప్రజా జ్యోతి)మే 11** భవిష్యత్ రైతాంగ పోరాటాల ఉధృతం చేయడం తో పాటు నిర్మాణం కోసమే మాస్ లైన్ అనుబంధ రైతు సంఘం అయినా అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయు కె ఎస్) జాతీయ మహాసభలు ఇల్లందు లో 11,12,13 తేదీల్లో జరుగుతున్నాయని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి రామకృష్ణ వెల్లడి వెల్లడించారు. ఇల్లందులో జరుగుతున్న జాతీయ ప్రథమ మహాసభ లకు సిరికొండ మండలం నుండి సోమవారం నాడు నాయకులు 50 మంది ప్రత్యేక వాహనాల్లో తరలి వెళ్లారు. ఇ సందర్బంగా లిసీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి రామకృష్ణ మాట్లాడుతు: తెలంగాణ సాయుధా రైతంగా పోరాటాలు జరిగిన నేల పై తన మహాసభలను జరుపుంటుంది అన్నారు. 11నాడు 10వేల మంది రైతులతో భారీ ర్యాలీ, సాయంత్రం 4గంటలకు భహిరంగసభ ఉంటుంది అన్నారు. 12, 13 నాడు కామ్రేడ్ కర్నాటి యాదగిరి స్మారక హాల్ లో ప్రతినిధుల సభ 300 మంది 16 రాష్ట్రాల నుండి ప్రతినిధులతో ఉంటుంది అన్నరు. మాహాసభల్లో భవశ్యత్ లో చేపట్టబోయే ఉద్యమాల పై చర్చి, చేపట్టవలసిన కర్తవ్యాలను రూపొందించు కోవడం జరుగుతుంది అన్నారు. నూతన జాతీయ కార్యవర్గంను ఎన్నుకోవడం జరుగుతుంది అన్నారు. ఇల్లందులో జరుగుతున్న జాతీయ మహాసభ లు రైతంగానికి ఒక దశ, దిశ ను అందించ బోతున్నాయి అన్నారు. నూతన ఉత్సాహం తో పనిచేయాలి అని నాయకత్వం కు సూచించారు. ల్లందు వెళ్లిన వారిలో సీపీఐ(ఎం ఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు ఆర్ రమేష్, ఏఐయు కె ఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవారం, జిల్లా అధ్యక్షుడు ఎస్ సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు యూ రాజన్న, ఆకుల గంగారాం, జి నడిపినర్సయ్య, జిల్లా కార్యదర్శి ఆర్ దామోదర్, బి కిషన్, అల్గొట్ సాయిలు, వి బాలయ్య, టి గంగాధర్ తదితరులు ఉన్నారు.

### ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొన్న

# డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి



**సిరికొండ( ప్రజా జ్యోతి )మే 11** ఈ రోజు సిరికొండ మండలంలోని సిరికొండ మహిపాల్ తండాలో సిరికొండ బంజారా కమిటీ అధ్యక్షులు బాదావత్ రూప్ సింగ్ గారి తమ్ముడు బాదావత్ జేతులాల్ గారి నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ శుభ కార్యక్రమానికి డిసిసి ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరికొండ ఉప సర్పంచ్ గ్రామ శోభన్, గడ్కోల్ ఉపసర్పంచ్ సంపత్ రెడ్డి, సిరికొండ మెట్టుమరి తండా సర్పంచ్ కే. తిరుపతి, గడ్డమీద సర్పంచ్ కే. రామ్ సింగ్, సర్పంచ్ తండా సర్పంచ్ మాలవత్ శోభ జీవన్ నాయక్, వర్జన్ తండా సర్పంచ్ మోజీరం, ముషిర్ నగర్ ఉప సర్పంచ్ ధోని మోహన్, గంగారెడి,పాప గంగారెడి,భానుచందర్ రెడ్డి, జై భాస్కర్, నవీన్, భాసంత్, జగదంబ తండా సర్పంచ్ రవి నాయక్ గారు మరియు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

### సిరికొండ ఎల్ఎన్ఆర్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ నాయకుడు

# కుమారుడి వివాహానికి హాజరైన ఎమ్మెల్యే భూపతిరెడ్డి





**సిరికొండ( ప్రజా జ్యోతి )మే 11** సిరికొండ మండలంలోని పెదవాల్గోడు గ్రామానికి చెందిన మండల కిషన్ కేత్ అధ్యక్షుడు గాదారి నర్సారెడ్డి కుమారుడు వివాహానికి స్థానిక ఎల్ ఎన్ ఆర్ గార్డెన్ లో నిర్వహించగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్.ఆర్. భూపతిరెడ్డి హాజరయ్యా రు ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరి వైవాహిక జీవితం ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మాజీ ఐడీసీఎం ఎస్ చైర్మన్ మున్సిపల్ సాయి రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శిలు వెల్మ భాస్కర్ రెడ్డి, గొల్ల ఎర్రన్న, మండల అధ్యక్షుడు బాకారం రవి, ఉమ్మాజీ నరేష్, దేగం సాయన్న మండలంలోని సర్పంచులు, ఉప సర్పంచ్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

### పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్

# కళాశాలలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభోత్సవం





**సిరికొండ ( ప్రజా జ్యోతి )మే 11** సిరికొండ మండల కేంద్రంలో పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ జూనియర్స్ కళాశాల నందు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ ఘనంగా ప్రారంభించారు కార్యక్రమానికి ఎమ్మార్వో రవీందర్రావు, ఎంపీడీవో కే మనోహర్ రెడ్డి, ఎంఈఓ రాములు, సర్పంచ్ సాయిచరణ్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్పర్సన్ కాంతమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు ఎమ్మార్వో రవీందర్ రావు గారు ఇతర ప్రముఖులతో కలిసి సమ్మర్ కాపును ప్రారంభించారు అనంతరం సర్పంచ్ సాయి శరన్ మరియు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ శ్రీమతి కాంతమ్మ టేబుల్ టెన్నిస్ గేమ్ హాల్లో ప్రారంభించారు పాఠశాల ప్రిన్సిపల్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ సమ్మర్ క్యాంప్ లో ఏర్పాటుచేసిన సదుపాయాలను వివరించారు విద్యార్థుల నైపుణ్య అభివృద్ధి కోసం ఒక ఫిజికల్ డైరెక్టర్, ఒక కంప్యూటర్ ఇన్ స్ట్రక్కర్, ఒక స్పోకెన్ ఇంగ్లీష్ టీచర్ మరియు ఒక సైన్స్ టీచర్ ను ప్రత్యేకంగా నియమించినట్లు తెలిపారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్టు చేయాలి

- బీఆర్ఎస్ నాయకులు డిమాండ్



**నాగిరెడ్డిపేట్,మే11(ప్రజాజ్యోతి):** మైనర్ బాలికను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురిచేయడం దుర్మార్గమని నాగిరెడ్డిపేట్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రాల సిద్దయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రాంప్రతాప్ థియటర్ లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ కుమారుడిపై ఫోక్సో కేసు నమోదైనా భగీరథను ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని,చట్టం అందరికీ ఒకేలా ఉండాలని సామాన్యుడికి ఒకలా,కేంద్ర మంత్రి కుమారుడికి మరోలా చట్టం ఉంటుందా అని హేళన చేశారు.బండి సంజయ్ కొడుకు పై నమోదైన కేసును బీజేపీ నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారని, కాంగ్రెస్, బిజెపి పార్టీలు కుమ్మక్కై బండి సంజయ్ కొడుకును అరెస్టు చేయడం లేదని,ఇప్పటికైనా ప్రభుత్వం, పోలీసులు, ఉన్నతాధికారులు స్పందించి బండి సంజయ్ కుమారుడిని ఫోక్సో కేసులో వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.బండి సంజయ్ నైతిక బాధ్యత వహించి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వంశీకృష్ణ గౌడ్, బాల్య నాయక్, నాయకులు దుర్గారెడ్డి, సాయిబాబా, హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నిజామాబాద్ నగర పాలక సంస్థ

# కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రశాంతం

- నిజామాబాద్ రూరల్ నుంచి కల్లెడ అశోక్‌కు అవకాశం
- కార్పొరేషన్ సమావేశ మందిరంలో కొనసాగిన ఎన్నిక ప్రక్రియ
- ఐదుగురు కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక





**నిజామాబాద్ రూరల్( ప్రజా జ్యోతి)మే 11** నిజామాబాద్ నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ ఉమారాణి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ , నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేటర్లు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు ఐదుగురు సభ్యులను కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నిక ద్వారా ఎంపిక చేశారు. కాగా మొత్తం 58 దరఖాస్తులు రాగా అందులో ఐదుగురికి కో ఆప్షన్ సభ్యులుగా అవకాశం దక్కింది. ఇందులో ఇద్దరు ముస్లిం మైనారిటీలు, 1 సిక్కు మైనారిటీగా ఉండగా మరో ఇద్దరు బీసీ జనరల్ కు కేటాయించారు. ఇందులో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి బోర్గం (పి)డివిజన్ నంబర్ 5 నుంచి బీసీ జనరల్ విభాగంలో కల్లెడ అశోక్ కు కో ఆప్షన్ సభ్యుని పదవి వరించింది. దీంతో స్థానిక నిజామాబాద్ రూరల్ నియోజవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి ఆయనకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అశోక్ ను శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల వారికి అవకాశాలు కల్పిస్తుందని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. పార్టీలో కష్టపడ్డ వారికి సముచిత స్థానం ఉంటుందని స్పష్టం చేశారు.

**కల్లెడ అశోక్ నేపథ్యం ఇలా..!**

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం బోర్గాం (పీ) గ్రామానికి చెందిన కల్లెడ అశోక్ 2002 నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే 2002-2007 మధ్య కాలంలో మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న బోర్గాం (పీ) గ్రామానికి వార్డు మెంబర్ గా, అదేవిధంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించడంతో పాటు జిల్లా రజక సంఘం ఐక్యవేదికలో 2012 మధ్య కాలంలో కోశాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. దీంతో ఆయన సేవలకు గుర్తింపుగా సోమవారం జరిగిన నగర పాలక సంస్థ ప్రత్యేక సమావేశంలో కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలో ఆయన్ను నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడిగా ఎన్నుకున్నారు. దీంతో ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

# విద్యా వారోత్సవాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్









**కామారెడ్డి ప్రతినిధి మే 11. (ప్రజాజ్యోతి)** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల తొలి రోజు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సోమవారం పాల్వంచ మండలం భవానిపేట్ తాండా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యా వారోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న సమ్మర్ క్యాంప్ ఈ నెల 11వ తేదీ నుండి 25వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కేజీబీవీ విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభ, నైపుణ్యాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది వేయడంలో కీలక పాత్ర పోషించాలని అన్నారు.విద్యార్థినులు నాణ్యమైన విద్యను అందిపుచ్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్య కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నైపుణ్యాభివృద్ధికి దోహదపడాలని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.విద్యా వారోత్సవాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలను తిలకించి అభినందించారు.ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జయరాజ్ పాల్వంచ తాసిల్దార్ జనార్ధన్. డిఎల్పిఓ శ్రీనివాస్.ఎంఈఓ. ప్రిన్సిపల్ మహిషా. డిఈసిఓ సుకన్య సంబంధిత శాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రజాసేవలో అంకితభావంతో ముందుకు

# సాగుతున్న ఇస్రోజీవాడి ఉప సర్పంచ్ సిద్ధం స్వామి

- గ్రామాభివృద్ధికి కంకణబద్ధుడై ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండే యువ నాయకుడు
- వార్డ్ సభ్యునిగా ప్రారంభమైన సేవా ప్రయాణం
- ఉప సర్పంచ్ స్థాయికి ఎదిగి గ్రామ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్న సేవాభావి ప్రజాప్రతినిధి
- "ప్రజల కోసం పనిచేయడమే నా జీవిత లక్ష్యం" అంటూ అభివృద్ధి దిశగా నిరంతరం శ్రమిస్తున్న సిద్ధం స్వామి



**కామారెడ్డి రూరల్ మే 11 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ సిద్ధం స్వామి ప్రస్తుతం గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. గ్రామ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తున్న ఆయన సేవా తత్వం గ్రామంలో విశేష ఆదరణ పొందుతోంది. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ గ్రామ ప్రజల సంక్షేమమే తన ప్రధాన ధ్యేయమని భావిస్తూ సేవలందిస్తున్న సిద్ధం స్వామి యువ నాయకత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారు. చిన్ననాటి నుంచే సామాజిక సేవా కార్యక్రమాలపై ఆసక్తి కలిగిన సిద్ధం స్వామి గ్రామంలో జరిగే ప్రతి కార్యక్రమంలో ముందుండి పాల్గొంటూ ప్రజలకు సహాయ సహకారాలు అందించేవారు. గ్రామంలో పేద కుటుంబాలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి తన వంతు సహాయం అందిస్తూ మంచి మనసున్న వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందిస్తూ గ్రామ ప్రజల అభిమానాన్ని సంపాదించారు. గ్రామంలో సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు దగ్గరైన సిద్ధం స్వామి, ప్రజల విశ్వాసంతో గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వార్డ్ సభ్యునిగా ఎన్నికయ్యారు. వార్డ్ సభ్యునిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామ సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి కృషి ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి వీధిని సందర్శిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నించారు.వార్డ్ సభ్యునిగా ఉన్న సమయంలో గ్రామంలో తాగునీటి సమస్యలు, పారిశుధ్య లోపాలు, రహదారుల సమస్యలు, కాలువల సమస్యలు, వీధి విద్యుత్ దీపాల సమస్యలు వంటి అనేక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులతో సమన్వయం చేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటూ మంచి ప్రజాప్రతినిధిగా గుర్తింపు పొందారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో కూడా సిద్ధం స్వామి కీలక పాత్ర పోషించారు. రైతులకు రైతు బంధు, రైతు బీమా, మహిళలకు సంక్షేమ పథకాలు, వృద్ధులకు పింఛన్లు, విద్యార్థులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ ప్రజలకు సహాయం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తూ గ్రామ ప్రజలకు మార్గదర్శనం చేశారు. గ్రామంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజలకు అవగాహన కల్పించారు. పింఛన్లు, రేషన్ కార్డులు, ఉపాధి హామీ పనులు, రైతు సంక్షేమ పథకాలు వంటి అంశాల్లో ప్రజలకు సహాయం చేస్తూ మంచి పేరు సంపాదించారు. గ్రామ ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.వార్డ్ సభ్యునిగా తన పదవీకాలంలో ప్రజలకు అందించిన సేవలను గుర్తించిన గ్రామ ప్రజలు ఈ ఎన్నికల్లో ఆయనకు మద్దతు తెలుపుతూ ఉప సర్పంచ్ పదవికి ఎన్నుకున్నారు. ఉప సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గ్రామాభివృద్ధి పనుల్లో మరింత చురుకుదనంతో పాల్గొంటున్నారు. గ్రామంలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా కృషి చేస్తున్నారు.గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, తాగునీటి పైప్‌లైన్లు, వీధి విద్యుత్ దీపాల ఏర్పాటు, గ్రామ శుభ్రత వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామాన్ని పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి పనిచేస్తూ ప్రతి రోజు పరిశుభ్రత పనులను పర్యవేక్షిస్తున్నారు. గ్రామ ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణం కోసం కృషి చేస్తున్నారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. గ్రామ యువత, విద్యార్థులను మొక్కల సంరక్షణలో భాగస్వామ్యం చేస్తూ పచ్చదనం పెంపుకు కృషి చేస్తున్నారు. "పచ్చని గ్రామం -- ఆరోగ్యకర జీవనం" అనే లక్ష్యంతో గ్రామాన్ని హరిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు.ఉపాధి హామీ పథకం పనుల్లో కూడా చురుకుగా పాల్గొంటూ గ్రామ కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. చెరువుల అభివృద్ధి, కాలువల శుభ్రత, గ్రామ రహదారుల మరమ్మతులు వంటి పనుల్లో ఉపాధి హామీ పనులను సమర్థంగా వినియోగిస్తున్నారు. పనుల్లో పారదర్శకత పాటిస్తూ కూలీలకు సమయానికి వేతనాలు అందేలా అధికారులతో సమన్వయం చేస్తున్నారు.విద్యాభివృద్ధికి కూడా సిద్ధం స్వామి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, మౌలిక వసతుల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ వారికి ప్రోత్సాహం అందిస్తున్నారు.యువత గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని భావిస్తూ వారికి ప్రోత్సాహం అందిస్తున్నారు. క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాల్లో యువతను భాగస్వామ్యం చేస్తూ గ్రామంలో ఐక్యత పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు. యువతకు మంచి మార్గనిర్దేశం చేస్తూ గ్రామ భవిష్యత్తు కోసం పనిచేస్తున్నారు. గ్రామంలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలు, జాతరలు, బోనాలు, పండుగలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో సిద్ధం స్వామి చురుకుగా పాల్గొంటూ ప్రజలతో మమేకమవుతున్నారు. ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామ ప్రజలతో కలిసి పనిచేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. గ్రామంలో సామరస్య వాతావరణం నెలకొనేలా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుపోతూ ఆదర్శ నాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. ప్రజలకు ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సిద్ధం స్వామి సేవలను గ్రామ ప్రజలు ప్రశంసిస్తున్నారు. ప్రమాదాలు, అనారోగ్య సమస్యలు, పేద కుటుంబాల ఇబ్బందులు వంటి సందర్భాల్లో వెంటనే స్పందిస్తూ ఆర్థిక సహాయం, ఇతర సహకారం అందిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. గ్రామాభివృద్ధి కోసం ఇంకా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలని సిద్ధం స్వామి తపన పడుతున్నారు. మంచి ఒరవడిలో పని చేస్తూ ఇస్రోజీవాడిని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని సంకల్పంతో పనిచేస్తున్నారు. "ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం నా బాధ్యత. గ్రామ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. ఇంకా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ఇస్రోజీవాడిని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తాను. ప్రజల కోసం పనిచేయడమే నా జీవిత లక్ష్యం" అని ఉప సర్పంచ్ సిద్ధం స్వామి తెలిపారు. గ్రామ ప్రజలు కూడా సిద్ధం స్వామి సేవలను ప్రశంసిస్తూ ఆయన ప్రజలకు దగ్గరగా ఉంటూ గ్రామాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన గ్రామానికి మరింత సేవ చేసి మంచి నాయకుడిగా ఎదగాలని గ్రామ పెద్దలు, యువత, మహిళలు ఆకాంక్షిస్తున్నారు.

# పుస్తకాలకే కాదు.. ప్రతిభకు కూడా ప్రాధాన్యం..

– విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న సమ్మర్ క్యాంప్

– ప్రధానోపాధ్యాయులు సాంబయ్య






**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) మే 11 :** మెదక్ జిల్లా వెల్దుర్తి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో వేసవి శిక్షణ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ అదర్శ్ మరియు ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ, వేసవి సెలవులు కేవలం విశ్రాంతికే కాదు, వ్యక్తిత్వ వికాసానికి కూడా ఉపయోగపడాలని విద్యార్థులకు సూచించారు. పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం కాకుండా కళలు, క్రీడలు, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించుకునే దిశగా ఈ శిబిరం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో చిత్రలేఖనం, యోగా, క్రీడలు, సంగీతం, నృత్యం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వంటి పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. విద్యార్థులు కూడా ఈ శిబిరంపై ఆనందం వ్యక్తం చేస్తూ, కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు పాఠశాల చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సృజనాత్మకత నాయకత్వం, ఈ నాలుగు విలువలను విద్యార్థుల్లో పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ వేసవి శిక్షణ శిబిరం ఆదర్శవంతంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, ఖదీర్, విజయ్ మోహన్, అమూల్య, అర్చన, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సృజన, సిఆర్పీ రాజు, జూ. అసిస్టెంట్ మల్లేష్, సాబెర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్

# కళాశాలలో ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

– ఐఎఫ్‌పి, ఐడిపి ప్యానెల్స్ ప్రారంభంతో విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం

– కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు





**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) మే 11:** రాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వెల్దుర్తిలో ఇంటర్మీడియట్ కమిషనర్ ఆదేశాల మేరకు "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ బి. శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ ఎఫ్ పి, ఐ డి పి ప్యానెల్స్‌ను ప్రారంభించారు. సర్పంచ్ ఆదర్శ్ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించగా, ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్ విద్యార్థులకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ బి శ్రీనివాసులు మాట్లాడుతూ మే 13 నుంచి 19 వరకు సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి 5:30 వరకు జరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు



**సిద్దిపేట, మే 11 ,(ప్రజాజ్యోతి):** సిద్దిపేట జిల్లాలో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లు రష్మీ పెరుమాళ్ తెలిపారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 ప్రకారం జిల్లాలోని 27 పరీక్షా కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు ,అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఆంక్షలు మే 13 నుండి మే 21 వరకు పరీక్షలు జరిగే ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు అమల్లో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో కర్రలు, రాళ్లు, ఆయుధాలు , ఇతర ప్రమాదకర వస్తువులు కలిగి ఉండటం నేరమని హెచ్చరించారు. పరీక్షలకు సంబంధించిన నిషేధిత పత్రాలను తీసుకెళ్లడం పూర్తిగా నిషేధమన్నారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ కేంద్రాలను తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు. విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సైనిక సిబ్బంది, విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, అంత్యక్రియల ఊరేగింపులకు ఈ ఉత్తర్వుల నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు తగిన బందోబస్తు, రక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బండి సాయి భగీరథపై నమోదైన

# పోక్సో కేసులో తక్షణ చర్యలు తీసుకోవాలి

– అరెస్టు చేసి నిష్పక్షపాత విచారణ జరపాలని కొమురవెల్లి బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



**కొమురవెల్లి, మే 11 (ప్రజా జ్యోతి):-** కేంద్ర హోం సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ పై పోక్సో చట్టం కింద కేసు నమోదు అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి విచారణ చేపట్టకుండా, చర్యలు తీసుకోకుండా పోలీస్ వ్యవస్థ వ్యవహరిస్తోందని కొమురవెల్లి మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సాధారణ ప్రజలపై కేసులు నమోదైతే వెంటనే చర్యలు తీసుకునే పోలీసులు, అధికార పార్టీ నాయకుల కుటుంబ సభ్యుల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. పోక్సో వంటి తీవ్రమైన చట్టం కింద కేసు నమోదైన నేపథ్యంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బండి సాయి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. చట్టం ముందు అందరూ సమానమనే భావన ప్రజల్లో కలగాలంటే ప్రభుత్వం, పోలీస్ శాఖ పారదర్శకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను

# పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి



**సిద్దిపేట, మే 11 ,(ప్రజాజ్యోతి):** ఈవీఎం గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హైమావతి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నెలవారీ పరిశీలనలో భాగంగా గోదాం పరిసరాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లాగ్‌బుక్‌ను పరిశీలించి, విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం గోదాం చుట్టూ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. పోలీస్ అధికారులు గట్టి బందోబస్తు నిర్వహించాలని, ఈవీఎం గోదాం పరిసర ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## శ్రీ పోచమ్మ తల్లి ఆశీస్సులతో

# ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

– మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి

– హవేలీ ఘన్పూర్‌లో ఘనంగా పోచమ్మ అమ్మవారి వార్షికోత్సవం




**మెదక్ హవెలిఘన్ పూర్ (ప్రజాజ్యోతి ) మే 11 :** హవేలీ ఘన్పూర్ మండలం లోని శ్రీ పోచమ్మ అమ్మవారి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో సోమవారం మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని శ్రీ పోచమ్మ అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పడంలో ఇలాంటి ఉత్సవాలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలకు ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని కోరుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల సాయిలు, నాయకులు రామచంద్రారెడ్డి, శంకరంపేట్ ఆర్ మండల పార్టీ అధ్యక్షులు పట్లోరి. రాజు సీనియర్ నాయకుల లక్ష్మారెడ్డి,మల్లుపల్లి సర్పంచ్ ఇమ్మడి నరేష్, హవెలి ఘనపూర్ గ్రామ పెద్దలు వెంకట్ రెడ్డి, కుర్మ పోచయ్య, గుండ.సత్యనారాయణ, శ్రీపాల్,నల్ల లక్ష్మీనారాయణ, నోముల శ్రీకాంత్, కమ్మరి ఆంజనేయులు, దొమ్మాట రవీందర్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భౌతికశాస్త్ర బోధనలో నూతన దిశగా గీతం ఆర్పీడీపీ

– ఐఐటీ, ఐఐఎస్సీ, బార్క్ నిపుణులతో ఉపాధ్యాయులకు మూడు రోజుల శిక్షణా కార్యక్రమం

GITAM
DEEMED TO BE UNIVERSITY

**పటాన్ చెరు/ప్రజాజ్యోతి** హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక వృత్తి వికాస కార్యక్రమం నిర్వహించనుంది. 'అధునాతన భావనలు, బోధనా పద్ధతులు, విద్యా సాధనాలు' అనే అంశంపై జూన్ 1 నుంచి 3వ తేదీ వరకు మూడు రోజుల రెసిడెన్షియల్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఆర్పీడీపీ) జరగనుంది. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్ విశాఖ చాప్టర్ సహకారంతో, గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. పాఠశాల మరియు డిగ్రీ స్థాయిలో భౌతికశాస్త్ర బోధనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. భావనాత్మక అవగాహనను ప్రయోగాత్మక అభ్యాసంతో అనుసంధానిస్తూ, విద్యార్థుల్లో శాస్త్రీయ జిజ్ఞాస, చురుకైన అభ్యాసం, ప్రత్యక్ష అనుభవం పెంపొందించే ఆధునిక బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుదయస్కాంత సిద్ధాంతం, ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్, సూపర్ కండక్టివిటీ, అయస్కాంతత్వం, అణు వికిరణం వంటి ఆధునిక అంశాలతో పాటు తక్కువ ఖర్చుతో చేసే ప్రయోగాలు, స్వయంగా తయారు చేసుకునే ఫిజిక్స్ కిట్లు, ఐసీటీ ఆధారిత బోధన, మూల్యాంకన పద్ధతులపై ప్రత్యేక సెషన్లు నిర్వహించనున్నారు. దేశంలోని ప్రముఖ విద్యా, పరిశోధనా సంస్థల నుంచి నిపుణులు పాల్గొనడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఐఐటీ మద్రాస్ కు చెందిన ప్రొఫెసర్ టి.ఎస్. నటరాజన్, ఐఐఎస్సీ బెంగళూరు ప్రొఫెసర్ విబోర్ సింగ్, బార్క్ పూర్వ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జి.ఎ. రామారావు తదితరులు పాల్గొని మార్గదర్శనం చేయనున్నారు. భౌతికశాస్త్రం, విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులకు వినూత్న బోధనా విధానాలపై అవగాహన కల్పించడంతో పాటు పరస్పర అనుభవాల పంచికకు ఈ కార్యక్రమం వేదిక కానుంది. కార్యక్రమానికి డాక్టర్ జి. సాయిప్రీతి, డాక్టర్ టి. విశ్వం సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు షామాబీ (7780274121), గోపీకృష్ణ (8712018815)లను సంప్రదించి నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

# రాజకీయాలకు అతీతంగా బొల్లారం డివిజన్ అభివృద్ధి

- ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం
- ఒకే రోజు 19 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ప్రజాఅవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**జిన్నారం/ప్రజాజ్యోతి** రాజకీయాలకు అతీతంగా బొల్లారం డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్, బీసీ కాలనీ, బీరప్ప బస్తీ, గాంధీ నగర్, ఐడిఎ కాలనీ, కె.బి.ఆర్ కాలనీ, లక్ష్మీ నగర్, శ్రీ రామ్ నగర్, వైఎస్ఆర్ కాలనీలలో 19 కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యూజీడి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బొల్లారం డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నామని తెలిపారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న తాగునీటి సమస్యను సైతం పరిష్కరించడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు రూపకల్పన చేయబోతున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మాజీ జడ్పిటిసి బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, చంద్రారెడ్డి, సిఐ రవీందర్ రెడ్డి, ఈఈ సురేష్, డిఈ వెంకటరమణ, మాజీ ప్రజా ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా

# జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ: కలెక్టర్

- కొనుగోలుకు సంబంధించిన అన్ని సౌకర్యాలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయి
- రవాణాలో జాప్యం లేకుండా పటిష్ట చర్యలు
- కొల్చారం మండల కేంద్రంలో ఫ్యాక్స్ వరి కొనుగోలు కేంద్రం,

సత్య సాయి రైస్ మిల్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్




**కొల్చారం (ప్రజాజ్యోతి) మే 11 :** రైతులకు ఇబ్బందులు లేకుండా జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని కొనుగోలుకు సంబంధించిన అన్ని సౌకర్యాలు కేంద్రాల వద్ద అందుబాటులో ఉన్నాయని రవాణాలో జాప్యం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు, అన్లోడింగ్ లో సమస్యలు తలెత్తకుండా మిల్లర్లు సమన్వయంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ కొల్చారం మండల కేంద్రంలోని ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ నగేష్, కొనుగోలు కేంద్ర నిర్వాహకులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటి వరకు జరిగిన ధాన్యం కొనుగోలు వివరాలు, గన్ని బ్యాగ్ లు సరిపడా పంపిస్తున్నారా లేదా?కేంద్రాలకు కేటాయించిన లారీలు వస్తున్నాయా? లేదా? అలాగే నమోదు అయిన ఓపీఎంఎస్ వివరాల గురించి కేంద్ర నిర్వాహకు లను అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగే విధంగా చర్యలుతీసుకుంటున్నామని కొల్చారం మండల కేంద్రంలో ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రం ద్వారా ఇప్పటివరకు 13 లారీల ధాన్యం ఈ సెంటర్ నుండి సత్య సాయి రైస్ మిల్లుకు తరలించడం జరిగిందని ఈ సెంటర్లో హమాలీల కొరత లేదని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో సివిల్ సప్లై అధికారులు కొనుగోలు కేంద్రాలను తరచూ సందర్శిస్తూ రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## "మహిళల భద్రత, సైబర్ మోసాల నివారణలో అప్రమత్తంగా ఉండాలి"

### షీ టీం ఇంచార్జ్ నర్సిములు



**పరిగి, మే 11 (ప్రజాజ్యోతి) :** నాగార్జున సీడ్స్ గోదాం కార్మికులకు మహిళల భద్రత, సైబర్ నేరాలపై విస్తృత ప్రచారంలో భాగంగా షీ టీం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, పరిగి డిఎస్పి శ్రీనివాస్ ఆదేశాల మేరకు సోమవారం పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని రూఫ్ ఖాన్‌పేట్ గేట్ సమీపంలోని నాగార్జున సీడ్స్ గోదాంలో పరిగి సబ్ డివిజన్ షీ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి షీ టీం ఇంచార్జ్ నర్సిములు హాజరై మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై కార్మికులకు వివరించారు. అలాగే డయల్-100, షీ టీం హెల్ప్‌లైన్ 181, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 నంబర్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఇక బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, మద్యపాన నియంత్రణ, కమ్యూనిటీ పోలీసింగ్, సీసీ కెమెరాల ప్రాధాన్యత వంటి అంశాలపై కూడా కార్మికులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మక్కజొన్న గోదాం కార్మికులతో పాటు షీ టీం సభ్యులు సావిత్రి, శోభ పాల్గొన్నారు.

## బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు

### - వెంటనే అరెస్ట్ చేయాలి - డాక్టర్ మెతుకు ఆనంద్



**వికారాబాద్ ప్రతినిధి, మే 11(ప్రజాజ్యోతి) :** బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసులో తక్షణ చర్యలు తీసుకోవాలని డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై అత్యాచారం జరిగినట్లు తెలిసినా ఇప్పటివరకు నిందితుడిని అరెస్ట్ చేయకపోవడాన్ని తీవ్రంగా ఆక్షేపించారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాల్సిన పోలీసు యంత్రాంగం ఆలస్యం చేయడం అనుమానాలకు తావిస్తోంది అని అన్నారు. చిన్న చిన్న సోషల్ మీడియా పోస్టులకే వెంటనే చర్యలు తీసుకునే పోలీసులు ఈ విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారని విమర్శించారు. ఈ కేసు నమోదు కూడా నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన తరువాత ఆలస్యంగా జరిగిందని పేర్కొన్నారు. బాధితులకు ఇప్పటివరకు ఎఫ్ ఐ ఆర్ కాపీ అందలేదని, వారిపైనే ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో బీజేపీ పార్టీ బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని లేదా ఆయన స్వయంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి బాధిత బాలికకు న్యాయం చేయాలని బిఆర్ఎస్ తరఫున కోరుతున్నట్లు తెలిపారు.

## మోడీ సభ విజయవంతం

### తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం : ఎంపీ ఈటల రాజేందర్



**బోయిన్ పల్లి,మే11.(ప్రజా జ్యోతి) :** కంటోన్మెంట్ పరిధిలోని సోమవారం గాయత్రి గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్న భారీ బహిరంగ సభ చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని తెలిపారు.గత పది రోజులుగా సభ విజయవంతానికి సహకరించిన మీడియా ప్రతినిధులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాని సభకు కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు తరలివచ్చారని, సభా ప్రాంగణంతో పాటు బయట కూడా భారీగా జనసందోహం కనిపించిందన్నారు.ముఖ్యంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారని పేర్కొన్నారు.మేడ్చల్, సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, మోర్చా నాయకులు, డివిజన్ నాయకులు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, నార్త్ ఇండియా సమాజం ప్రతినిధుల సహకారంతో సభ ఘన విజయాన్ని సాధించిందని తెలిపారు. ఈ సభ ద్వారా రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందనే సంకేతాలను ప్రధాని మోడీ ఇచ్చారని అన్నారు.ప్రజలకు తాను సంవత్సరంలో 365 రోజులు అందుబాటులో ఉంటానని, రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకునే ఏకైక పార్టీ బీజేపీయేనని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. త్వరలో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రధాని మోడీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశవ్యాప్తంగా బీజేపీ విస్తరిస్తోందని, తెలంగాణలో కూడా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రం అప్పుల ఊబిలో నుంచి బయటపడాలన్నా, రైతులు, విద్యార్థులు, ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్నా బీజేపీకి అవకాశం ఇవ్వాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు.స్వదేశీ ఉత్పత్తులను ఎక్కువగా వినియోగించాలని, విదేశీ మారకద్రవ్య వ్యయం తగ్గించాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ ప్రభావంతో పెట్రోల్, గ్యాస్ ధరలు పెరిగాయని, పరిస్థితి ఎంత గంభీరంగా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. మేక్ ఇన్ ఇండియా -- మేడ్ ఇన్ ఇండియా లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.బీజేపీలో నాయకత్వానికి ఎలాంటి కొరత లేదని పేర్కొన్న ఆయన, కేంద్రం నుంచి నిధులు తీసుకుంటూనే విమర్శలు చేయడం సరికాదన్నారు. గతంలో కేసీఆర్ ప్రధాని మోడీని ప్రశంసించి, తర్వాత విమర్శలు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిధులపైనే నడుస్తోందని వ్యాఖ్యానించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేదని రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన ఆయన, రాజకీయ నాయకులు మాటలు జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు.అధికారాలు వస్తాయి పోతాయి కానీ మాట శాశ్వతంగా నిలుస్తుంది అని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.





## జి.వో 17 రద్దు చేయాలి

- బీఎంపీ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పాత్లావత్ గట్యా నాయక్
- కలెక్టర్ కార్యాలయం ఎదుట బీఎంపీ పార్టీ నిరసన





**పరిగి, మే 11 (ప్రజాజ్యోతి) :** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జి.వో 17ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఎంపీ పార్టీ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఎంపీ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పాత్లావత్ గట్యా నాయక్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రావాల్సిన హక్కులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. చేవెళ్ల సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని, కామారెడ్డిలో బీసీలకు ప్రకటించిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో టెండర్ వ్యవస్థలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కల్పించిన రిజర్వేషన్లను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. డిక్లరేషన్లు ప్రకటించినప్పటికీ అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంచన్‌పల్లి ఆనంద్, బీఎంపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నేనావత్ హరి నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ కార్యదర్శి, భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాయక్, మాజీ సర్పంచ్ జగన్, గొరబంజారా హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వేరేందర్ నాయక్, విజయ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘాల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం : మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి






**పరిగి, మే 11 (ప్రజాజ్యోతి) :** రాష్ట్రంలో జరుగుతున్న వరుస ఘటనలను చూస్తే కాంగ్రెస్ ప్రభుత్వం శాంతిభద్రతలను పూర్తిగా గాలికి వదిలేసినట్లు స్పష్టమవుతోందని, ముఖ్యంగా హైదరాబాద్‌లో నేరాలు, అత్యాచారాలు, హత్యల వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆరోపించారు. సోమవారం తన నివాసంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పాలన పూర్తిగా అధోగతికి చేరిందన్నారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన జ్యువెలరీ షాప్ దొంగతనం ఘటనతో పాటు ఓ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కుటుంబ సభ్యురాలిని నేపాల్‌కు చెందిన వ్యక్తులు హత్య చేసిన సంఘటన వంటి పరిణామాలు రాష్ట్రంలో భద్రతా పరిస్థితులు ఎంత దయనీయంగా ఉన్నాయో తెలియజేస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో చట్టవ్యవస్థ బలహీనపడిందని, ప్రజల్లో భయాందోళనలు పెరుగుతున్నాయని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక శాఖలతో పాటు హోంశాఖను కూడా తన వద్దే ఉంచుకోవడం వల్ల పోలీస్ శాఖతో సమీక్ష సమావేశాలు సక్రమంగా జరగడం లేదని విమర్శించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథపై మైనర్ బాలికకు సంబంధించిన ఆరోపణలు వచ్చినప్పటికీ ప్రభుత్వం వాటిని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మైనర్ బాలికలపై జరిగే అత్యాచార కేసుల్లో సాధారణంగా వెంటనే చర్యలు తీసుకునే పోలీసులు, ఈ వ్యవహారంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఫోక్సో చట్టం కఠినమైనదైనా, కేసును బలహీనపరిచే విధంగా సెక్షన్లు నమోదు చేస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. గతంలో బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని కాంగ్రెస్ నాయకులు ఆరోపించేవారని, ఇప్పుడు కాంగ్రెస్ - బీజేపీ మధ్య ఉన్న అనుబంధం ఆదివారం మోది సభ ద్వారా అలాగే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పై వున్న సాన్నిహిత్యం ఈ సంఘటన తో బహిర్గతం కావడంతో ప్రజలకు అర్థమవుతోందని మహేష్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి కుమారుడు పై వేంటనే చర్యలు తీసుకుని బాధితురాలి కి న్యాయం చేయాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, కనీసం ప్రజల రక్షణ కూడా కల్పించలేకపోతోందని విమర్శించారు. ఈ సమావేశంలో పరిగి మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆర్. ఆంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్లు, శివనోళ్ళ భాస్కర్, మీర్ తాహేర్ అలీ, మీదిగడ్డ శ్రీనివాస్ నరేష్ యాదవ్, వెంకటరామిరెడ్డి, సేవ్య నాయక్, రాఘవేందర్ రెడ్డి శంకర్ నాయక్, ఎదిరే కృష్ణా, బలాల, నయ్యరీం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి విద్యా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

### ప్రభుత్వ విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది : శ్రీగణేష్







**బోయిన్ పల్లి, మే11.(ప్రజా జ్యోతి):** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన విద్యా వారోత్సవాలకు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్య అతిథిగా హాజరై వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను కార్పొరేట్ విద్యకు ధీటుగా అభివృద్ధి పరుస్తోందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు.ప్రభుత్వ విద్యాసంస్థలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించారు.కళాశాల అభివృద్ధి కోసం అవసరమైన అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా నాయకులు, బిఎల్‌ఏలు అప్రమత్తతో పనిచేయాలి

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



**కుత్బుల్లాపూర్ మే 11 (ప్రజాజ్యోతి) :** బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 127- రంగారెడ్డి నగర్ డివిజన్ లోని ఆదర్శ్ నగర్ కమ్యూనిటీ హాల్ లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) పై నిర్వహించిన రంగారెడ్డి నగర్ డివిజన్ కు చెందిన నాయకుల, బిఎల్‌ఏ ల అవగాహన సదస్సు కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) కార్యక్రమ నిర్వాహణ, పాటించవలసిన నియమ, నిబంధనలు, సర్ కార్యక్రమ ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2002 జనాభా ప్రాతిపదికన ఎన్నికల సంఘం అద్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో నిజమైన ఓటర్లను గుర్తించడంతో పాటు, డూప్లికేట్ ఓట్లు, పర్మినెంట్ మైగ్రేటెడ్ ఓట్లు, అసలు మనుషులు లేని పేర్లతో ఉన్న ఓట్లను గుర్తించడం, కుటుంబ సభ్యుల ఓట్లను మ్యాపింగ్ చేయడం, కొత్త ఓటర్లను చేర్చడం, ఇంకా ఏమైనా చేర్పులు, మార్పులు ఉంటే వాటిని సరిదిద్దేలా నాయకులు, బిఎల్‌ఏలు, సంక్షేమ సంఘాల నాయకులు, సీనియర్ సిటిజన్స్, యువత ఒక బాధ్యతగా తీసుకొని ప్రజలను చైతన్య పరుస్తూ అధికారులను సమన్వయ పరుచుకుంటూ సర్ కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకోవాలనేలా పనిచేయాలన్నారు. ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు లేకుండా నాయకులు, బిఎల్‌ఏలు అప్రమత్తతో పనిచేయాలన్నారు. అదేవిధంగా రానున్న రోజుల్లో బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతంకై చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం, నూతన కమిటీల నియామకంతో పాటు పార్టీ బలోపేతానికి మరింత ప్రజల్లోకి ఎలా దూసుకువెళ్లాలనే చేపట్టవలసిన కార్యాచరణను వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయ్ శేఖర్ గౌడ్, మాజీ డివిజన్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, డివిజన్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు సహాయక పరికరాల అందజేత

### ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి :** సరూర్‌నగర్‌లో ప్రత్యేక అవసరాల పిల్లలకు సహాయక పరికరాల పంపిణీ సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా పరిధిలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల ఎస్ డబ్ల్యు ఎస్ ఎన్ కోసం నిర్వహించిన కార్యక్రమంలో సోమవారం నాడు సహాయక పరికరాల అందజేత సరూర్‌నగర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరిగింది. కార్యక్రమానికి ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సహాయక పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందని తెలిపారు. వారి విద్యాభివృద్ధి, స్వయం ఆధారిత జీవనం కోసం అవసరమైన సేవలు, విద్యా సహాయం, ఉపకరణాలు అందించేందుకు సమగ్ర శిక్ష తెలంగాణ మరింత కృషి చేస్తుందని ఈ సందర్భంగా అన్నారు

## చిల్కూరులో మహిళలకు ఉచిత మగ్గం వర్క్ శిక్షణ




**వికారాబాద్ ప్రతినిధి, మే 11(ప్రజా జ్యోతి):** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నడిచే గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్ ఎస్ ఈ టి ఐ), చిలుకూరు లో గ్రామీణ మహిళలకు ఉచితంగా "మగ్గం వర్క్" శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ శిక్షణ మే 13, 2026 నుండి ప్రారంభమవుతుంది. రంగారెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన 18 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. శిక్షణ కాలం 30 రోజులు. ఆసక్తి గల అభ్యర్థులు మే 12, 2026 నుండి సంస్థ కార్యాలయంలో లేదా ఇచ్చిన ఫోన్ నంబర్ల ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు. శిక్షణార్థులు ఎస్ ఎస్ సి మెమో, రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, బ్యాంక్ పాస్‌బుక్, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు జిరాక్స్ కాపీలతో సమర్పించాలి. శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్ వసతి, భోజనం, యూనిఫాంతో పాటు టూల్ కిట్స్ అందజేయబడతాయని సంస్థ సంచాలకులు మొహమ్మద్ అలీ ఖాన్ తెలిపారు. మరిన్ని వివరాలకు: 8500165190 ను సంప్రదించవచ్చు.

## మన్సూరాబాద్ డివిజన్ సమస్యలపై జలమండలి అధికారులతో చర్చలు

### మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి




**రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ (ప్రజా జ్యోతి) ప్రతినిధి:** మన్సూరాబాద్ ఉమ్మడి డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ పనులు ఆలస్యం కావడం, తాగునీటి సమస్యలు, లో ప్రెజర్ సరఫరా వంటి సమస్యలపై మాజీ జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి హయత్‌నగర్ హెచ్ఎం డబ్ల్యు ఎస్ మరియు ఎస్ బి జలమండలి జిఎం కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులను నిలదీశారు. మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి తో కలిసి పలు కాలనీల్లో టెండర్ పూర్తయినా పనులు ప్రారంభం కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే వేసవిలో తాగునీటి లో ప్రెజర్ సమస్యలు, పాడైన మాన్‌హోల్స్ మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనిపై అధికారులు స్పందించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## జగద్గిరిగుట్ట హనుమాన్ ఆలయంలో ఘనంగా కూన కృష్ణ గౌడ్ ఇరుముడి కార్యక్రమం



**కుత్బుల్లాపూర్ మే 11 (ప్రజాజ్యోతి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జగద్గిరిగుట్ట పాపిరెడ్డి నగర్‌లోని హనుమాన్ ఆలయంలో స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ తనయుడు కూన కృష్ణ గౌడ్ హనుమాన్ మాల ధారణ ధరించిన నేపథ్యంలో వారి యొక్క ఇరుముడి కార్యక్రమం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి మాజీ ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం హనుమాన్ మాల ధార స్వాములతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు హనుమాన్ మాల ధార ధరించిన స్వాములు లిమాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ శాలువాతో సత్కరించి స్వామి వారు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీమేడ్చల్ మల్కాజిగిరి డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్‌తో పాటు స్థానిక హనుమాన్ స్వాములు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీజేపీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ రావుల



**కుత్బుల్లాపూర్ మే 11 (ప్రజాజ్యోతి) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధిలో గాజుల రామారం డివిజన్ కైసర్ నగర్ డబల్ బెడ్రూంలో మెడికల్ షాప్ ప్రారంభోత్సవంలో ఫ్రీ హెల్త్ క్యాంప్‌లో పాల్గొన్న భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్ గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి పాల్గొన్నారు.

## ప్రజావాణి'కి 185 దరఖాస్తులు

కరీంనగర్ బ్యూరో,ఏప్రిల్ 11(ప్రజాజ్యోతి ) ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా




అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 129 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజన్లో పరిధిలో ఆర్డీవోల ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. కరీంనగర్ రెవెన్యూ డివిజన్ కు 40 దరఖాస్తులు, హుజురాబాద్ రెవిన్యూ డివిజన్ కు 16 దరఖాస్తులు వచ్చాయి.కలెక్టర్, రెవిన్యూ డివిజన్లలో వచ్చిన మొత్తం 185 దరఖాస్తులు వచ్చాయి.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ మహేశ్వర్, జెడ్పి సీఈవో శ్రీనివాస్, డి ఆర్ డి ఓ శ్రీధర్, ఏవో సుధాకర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రాచర్ల బొప్పాపూర్ ప్రభుత్వ పాఠశాలలో లో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

### సర్పంచ్ ఇల్లెందుల గీతాంజలి....

ఎల్లారెడ్డిపేట మే 11 (ప్రజా జ్యోతి ) ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రాచర్ల బొప్పాపూర్ పి ఎం శ్రీ ప్రభుత్వ పాఠశాలలో వేసవి శిక్షణా శిబిరాన్ని గ్రామ సర్పంచి ఇల్లందుల గీతాంజలి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి గాలి పెల్లి కృష్ణ హరి హాజరయ్యారు .ఈ సందర్భంగా



ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే బడి ఈడు పిల్లలందరూ వేసవిలో శిక్షణ శిబిరం ద్వారా వివిధ కోర్సులు అల్లికలు ,కుట్టు మిషన్ ,డ్రాయింగ్, చిత్రలేఖన పైన ,ఇండోర్ గేమ్స్ పైన సరైన శిక్షణ ఇవ్వబడుతుందని ఆసక్తి గల విద్యార్థులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి మాట్లాడుతూ ప్రభుత్వము ప్రవేశపెట్టిన వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని మంచి నైపుణ్యత పొందాలని విద్యార్థులను ఉద్దేశించు అన్నారు .పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రవేశపెట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో పిల్లలు తమ శిక్షణ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణ శిబిరం నడుస్తుందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇల్లెందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి కృష్ణ హరి, ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి ఉపాధ్యాయులు బాలయ్య ,భరత్ ,భాస్కర్ రెడ్డి, చంద్రయ్య, ఉపేందర్ బాలయ్య, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి:: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

### ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి ప్రతినిధి, మే 11 ప్రజా జ్యోతి; అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. సుల్తానాబాద్ మండలం గట్టుపల్లి గ్రామానికి చెందిన బి. హన్సిక తనకు ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా తహసిల్దార్ కార్యాలయంలో ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడం లేదని, స్కాలర్షిప్ దరఖాస్తు చేసుకునేందుకు కుల దృవీకరణ పత్రం అత్యవసరం అయినందున తనకు వెంటనే కుల ధృవీకరణ పత్రం మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామపంచాయతీకి చెందిన ఆవుల వసంత తనకు ఇంటి నిర్మాణం కోసం ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్న అనుమతి మంజూరు చేయడం లేదని ఇంటిని నిర్మించు కునేందుకు అవసరమైన అనుమతులు మంజూరు అయ్యే విధంగా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా పంచాయతీ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రామగుండం నగరపాలక సంస్థకు చెందిన లింగం వెంకట్ రెడ్డి అయోధ్య నగర్ పరిధిలో ఇంటి యజమాని రేకుల ఇండ్లు నిర్మించుకుని దానికి తగిన పన్ను మాత్రమే చెల్లిస్తున్నారని, 6 సంవత్సరాల క్రితం ఆ రేకులను తొలగించి స్లాబ్ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నప్పటికీ పాత రేకుల ఇంటి పన్ను మాత్రమే చెల్లిస్తూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నందున దానిని పరిశీలించి కొత్త ఇంటికి పన్ను పెనాల్టీతో సహ వసూలు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించగా రామగుండం మున్సిపల్ కమిషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

### మహిళా సమైఖ్య సంఘ భవనం ప్రారంభించిన సుడా చైర్మన్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ టౌన్, మే 11 (ప్రజాజ్యోతి ) కరీంనగర్ రూరల్ మండలం బహదూర్ఖాన్ పేట







లో రూపాయలు పది లక్షలతో నిర్మించిన మహిళా సమైఖ్య భవనాన్ని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం సంబంధించిన నిధులతో నిర్మించిన మహిళా భవనం ఈ రోజు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను మహిళా సాధికారత దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తోందని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.సర్పంచ్ గుర్రం సంధ్య తిరుపతి రెడ్డి ఈ సంఘ భవనం త్వరిత గతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జగన్ మోహన్ రెడ్డి,డీఈ జనార్దన్,ఏఈ సమ్మయ్య,కంరెడ్డి రంరెడ్డి, సాయిని తిరుపతి, సర్పంచులు మోతే ప్రశాంత్ రెడ్డి,బోగొండ ఐలయ్య,కూర నరేష్ రెడ్డి,కామల్ గౌడ్,లక్ష్మి నారాయణ,రాజు,అంజయ్య,బాపురెడ్డి,తిరుపతి,అంజయ్య, మహిళా మండల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మిల్లులో ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలి

### రానున్న 15 రోజులు కీలకం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో, మే 11( ప్రజాజ్యోతి ) ధాన్యం కేటాయించిన రైస్ మిల్లులలో దిగుమతి ప్రక్రియ వేగవంతం చేసి కొనుగోళ్లలో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అధికారులు, రైస్ మిల్లర్స్, ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుమతి ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అన్నారు. తద్వారా కొనుగోలు రవాణా ప్రక్రియలో మరింత వేగం పెరుగుతుందని తెలిపారు. అధికారులు, మిల్లర్లు, రవాణాదారుల సమన్వయంతోనే కొనుగోళ్ల ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయగలమని అన్నారు. కొనుగోళ్ల ప్రక్రియ వేగానికి మిల్లర్లు సాధ్యమైన మేర ఎక్కువమంది హమాలీలను ఏర్పాటు చేయాలని అన్నారు. మిల్లర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.




రానున్న రెండు వారాల్లో పెద్ద మొత్తంలో ధాన్యం సేకరించాల్సి ఉంటుందని, అందుకు తగిన రీతిలో అందరూ సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారులు కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ మహేశ్వర్, పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రజనీకాంత్, డి ఆర్ డి ఓ శ్రీధర్, డి సి ఓ రామానుజాచారి, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర హోంశాఖసహాయమంత్రి పదవి కి బండి సంజయ్ కుమార్ రాజీనామా చెయ్యాలి...

గంభీరావుపేట మే 11(ప్రజా జ్యోతి); గంభీరావుపేటమండల కేంద్రములో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ ఆధ్వర్యంలో మండల సీనియర్ నాయకులు గాంధ్యాడపు రాజు సోమవారం రోజున మాట్లడుతూ, గత మూడు రోజుల క్రితం జరిగినటివంటి కేంద్ర హోంశాఖ సహాయకా మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరత్ 17 ఏళ్ల మైనర్ అమ్మాయి పై అత్యాచారం చేసిన సంఘటనలో ఫోక్సో కేసు నమోదు చేయడానికి గత మూడు నెలల నుండి బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్లను ఆశ్రయించిన కేసు నమోదు చేయకపోవడం రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం గత మూడు రోజుల క్రితం బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తామని చెప్తే ఫోక్సో కేసు నమోదు చేయడం జరిగింది. అయినా కూడా ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఎందుకంటే కేంద్రమంత్రి హోదాల ఉన్న బండి సంజయ్ కుమారుని కేసు నిర్వీర్యం చేయడానికి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధిత మహిళలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించినారు. ఇప్పటికైనా బాధిత మహిళ ఫిర్యాదు మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోని వెంటనే సాయి భగీరత్ ను అరెస్టు చేసి శిక్షించాలని, మైనర్




బాలిక కుటుంబానికి మనో ధైర్యాన్ని కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం న్నీ కోరారు. లేనియెడల బిఆర్ఎస్ పార్టీ నుంచి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించడం జరిగింది. అంతేకాకుండ ఈసంఘటకు నైతిక బాధ్యత వహించి మంత్రి పదవికి రాజీనామా చేయాలనీ డిమాండ్ చేసరు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి నాయకులు లింగన్నగారి దయాకర్ రావు,కొమ్మిరిశెట్టి లక్ష్మణ్, హన్మంతరెడ్డి,చెవుల మల్లేశం,చేరాల వెంకటస్వామి,పెద్దవేణి వెంకటి,చేరాలా లహరిక నిఖిల్ గౌడ్,నాగరపు దేవేందర్,దోసల శంకర్, కొత్తపల్లి వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలి

### మంత్రి కొడుకైనా.. సామాన్యుడైనా చట్టం ముందు అందరూ సమానమే

ముస్తాబాద్, మే 11: ( ప్రజా జ్యోతి): కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసులో ఎఫ్ఐఆర్ నమోదు



చేసి మూడు రోజులు గడిచినా ఇప్పటికీ అరెస్టు చేయకపోవడంపై ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టం ముందు సామాన్యుడైనా, కేంద్రమంత్రి కుమారుడైనా ఒకే విధంగా వ్యవహరించాలని, బాధితురాలికి తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు, పట్టణ అధ్యక్షుడు ఏద్దండి నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సైబరాబాద్ పోలీసులు ఈ కేసులో విచిత్ర ధోరణి అవలంబిస్తున్నారని ఆరోపించారు. బాధితురాలి వాంగ్మూలం నమోదు సమయంలో ఒత్తిళ్లు తెచ్చారని, జరిగిన విషయాన్ని పూర్తిగా చెప్పేందుకు అవకాశం ఇవ్వకుండా త్వరగా ముగించాలని దబాయించారని విమర్శించారు. వాంగ్మూలం నమోదు జరుగుతుండగానే పైస్థాయి నుంచి ఫోన్లు రావడం అనుమానాలకు తావిస్తున్నదన్నారు.

పోక్సో వంటి అత్యంత సున్నితమైన కేసుల్లో రాజకీయ ప్రభావాలకు తావులేకుండా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వారు కోరారు. బాధితురాలికి పూర్తి రక్షణ కల్పించి, నిందితుడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో చెవుల మల్లేశం, మండల యువజన అధ్యక్షుడు శీలం స్వామి, ముక్క మల్లయ్య తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో నిరుపేదల సొంతింటి కల సాకారం : సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి

గంగాధర మే 11: (ప్రజా జ్యోతి): నిరుపేదల సొంతింటి కల సాకారం కావడమే నిజమైన అభివృద్ధి అని గంగాధర గ్రామ సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం గంగాధర మండల కేంద్రంలోని గొల్లపెల్లి లత – సత్తయ్య దంపతులు తెలంగాణ ప్రభుత్వ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించుకున్న నూతన గృహ ప్రవేశ మహోత్సవానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న సర్పంచ్, లబ్ధిదారులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు (కొత్త బట్టలు) అందజేశారు.



అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. నిరుపేదలకు పక్కా గృహాలు కల్పించాలనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఎందరో కుటుంబాల్లో వెలుగులు నింపుతోందన్నారు. ఒక సామాన్య కుటుంబం తమ కష్టార్జితంతో, ప్రభుత్వ సహకారంతో సొంతింటిని నిర్మించుకోవడం ఎంతో సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. తమ ఇంటి గృహప్రవేశానికి విచ్చేసి, కొత్త బట్టలు పెట్టి గౌరవించిన సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్నకు లబ్ధిదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ యశ్వంత్,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పొన్నం వెంకటేశం,మంత్రి మహేందర్,జంగిలి మహేష్,గంగాధర రమేష్ పాల్గొన్నారు.

## చింతలకుంటపల్లె రైస్ మిల్లు, రహీంఖాన్‌పేట ప్రభుత్వ గోదాములను పరిశీలించిన ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్

ఇల్లంతకుంట మే10(ప్రజజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని చింతలకుంట పల్లె రైస్ మిల్లు, రహీంఖాన్‌పేటలోని ప్రభుత్వ గోదాములను సోమవారం రోజు ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, ఏపీఎం కుమారస్వామి సందర్శించారు. ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. రైతులు తీసుకొచ్చిన




ధాన్యాన్ని వేగంగా అన్‌లోడ్ చేసి గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా లారీ కాంట్రాక్టర్ గంప రామకృష్ణతో మాట్లాడి కొనుగోలు కేంద్రాల వద్ద లారీల కొరత లేకుండా చూడాలని సూచించారు. ధాన్యం రవాణాలో ఆలస్యం జరగకుండా అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.గోదాముల్లో నిల్వల నిర్వహణ, తేమ శాతం, నాణ్యత ప్రమాణాలపై కూడా పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు ఐరెడ్డి సురేందర్ రెడ్డి, సుధగోని తిరుపతి, ఏఎంసీ సెక్రటరీ హరినాథ్, సంబంధిత అధికారులు, మిల్లర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం - ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం ఘనంగా

ముస్తాబాద్, మే 11 ( ప్రజా జ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లబ్ధి పొందిన గంత నరసింహులు నూతన ఇంటి గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్ల బాల్ రెడ్డి , పోతుగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నరసయ్య , గ్రామ సర్పంచ్ పెండ్యాల మహేందర్ రెడ్డి



హాజరై రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొండం రాజిరెడ్డి , ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి , మార్కెట్ కమిటీ డైరెక్టర్ క్యారం రాజు , కొండాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు గంత రాజు , ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు భాను , సీనియర్ నాయకులు వంగ మోహన్ రెడ్డి , దేవిరెడ్డి , వట్టిమాళ్ల రాజేశం , సోషల్ మీడియా యారటి భారత్ , వివిధ గ్రామాల అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు గంత నరసింహులు మాట్లాడుతూ, “సొంత ఇల్లు నిర్మించుకోవడం నా జీవితకాల కల. ఆ కలను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను” అని అన్నారు.

## గంగాధరలో విద్య వారోత్సవలు

గంగాధర మే 11: (ప్రజా జ్యోతి): ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాల మొదటి రోజు గంగాధర మండలంలో ఫౌండేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు (11-05-2026 నుండి 17-05-2026 వరకు) ఉంటుంది. గంగాధర హైస్కూల్‌లో భవిత యాక్టివిటీ రూమ్, టీజీఎంఎస్ గంగాధరలో సమ్మర్ క్యాంప్, గర్షకుర్తి పాఠశాలలో కిచెన్ షెడ్‌ను సర్పంచ్‌లు పడాల భాగ్యలక్ష్మి, రెండ్ల శ్రీనివాస్, ఆంజనేయులు, మరియు వార్డ్ సభ్యులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అంబటి రజిత, ఎంపీడీఓ దమ్మాని రాము, ఎస్సై వంశీకృష్ణ, ఎంఈఓ ఏనుగు ప్రభాకర్ రావు, పాల్గొని విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు అందించారు. సమ్మర్ క్యాంప్ సందర్భంగా ఎంపీడీఓ దమ్మాని రాము మాట్లాడుతూ...విద్యార్థులు ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకొని కళలు, క్రాఫ్ట్స్, సంగీతం, క్రీడలు, రచనా నైపుణ్యాలు మరియు ఇతర సృజనాత్మక అంశాలను నేర్చుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. 25-05-2026 న జరిగే ముగింపు కార్యక్రమంలో తమ ప్రతిభను ప్రదర్శించాలని తహశీల్దార్ అంబటి రజిత విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి




– జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ – ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ప్రజలు సమస్యలు తెలుపుతూ సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. తల్లాడ మండలం కలకొడిమ గ్రామానికి చెందిన మనుబోలు రామారావు తన ఇంటికి వెళ్లే పంచాయతీ రోడ్డుకి ముళ్ళ కంప వేసి ప్రజా రహదారిని అడ్డగించడం గురించి ఫిర్యాదు చేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మధిర మండలం వెంకటాపురం, వంగవీడు, సిరిపురం గ్రామాలకు చెందిన పలు రైతులు పాలవాగు తర్వాత వచ్చు భగవానుల పురం గ్రామం వెళ్ళు స్టేజి నుండి ఆర్ అండ్ బి రోడ్డు ఎడం ప్రక్కన వరద వెళ్ళుటకు వేసిన పైపులు గత ఏడాది డ్యామేజ్ అయ్యాయని, ఒకవైపు మాత్రమే మళ్లీ పైపులు వేసారని రెండోవైపు పూడ్చివేసారని దానివల్ల వర్షం పడినప్పుడు నీరు వాగు వైపుకు రావటం లేదని, పాత పైపులు తీయకపోతే తమకు చాలా నష్టం జరుగుతుందని న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సత్తుపల్లి ఈఈ ఆర్ అండ్ బి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం పట్టణానికి చెందిన పగిళ్ళ రాము తనకు దివ్యాంగుల కోటాలో మీసేవ సెంటర్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈడిఎంకు రాస్తూ అవకాశం మేరకు పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఖమ్మం జిల్లా అధ్యక్షులు డి. నాగరాజు ఖమ్మం నగరానికి చెందినటువంటి నిరుపేద దివ్యాంగుల కుటుంబానికి చెందిన పదిమంది దివ్యాంగులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ కు రాస్తూ రెండవ జాబితాలో పరిశీలించి అర్హత మేరకు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ
# సభ్యత్వ నమోదు లక్ష్యాలను ప్రతి శాఖ పూర్తిచేయాలి



- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రతి శాఖకు నోడల్ అధికారిని నియమించి ఉద్యోగులను సభ్యత్వ నమోదుకు ప్రోత్సహించాలి
- 200 మందికి పైగా ఉద్యోగులు ఉన్న శాఖలు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు లక్ష్యాలను ప్రతి శాఖ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వంపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి జిల్లా అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదుకు అధికారులు పూర్తి సహకారం అందించాలని, ప్రతి శాఖలోని ఉద్యోగులను సభ్యత్వం నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలనిసూచించారు. ప్రతి శాఖకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి సభ్యత్వ నమోదు ప్రక్రియను పర్యవేక్షించాలని, ప్రతి శాఖకు లక్ష్యాలను నిర్ధారించి వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అధికారి స్వయంగా సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో రెడ్ క్రాస్ సొసైటీ సేవలు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కనీసం సుమారు వెయ్యి సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. ముఖ్యంగా రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్య, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఆర్ అండ్ బి తదితర శాఖలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. 200 మందికి పైగా ఉద్యోగులు ఉన్న శాఖలు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాల నమోదుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ
# నమోదు లక్ష్యాలను ప్రతి శాఖ పూర్తిచేయాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ప్రతి శాఖకు నోడల్ అధికారిని నియమించి ఉద్యోగులను సభ్యత్వ నమోదుకు ప్రోత్సహించాలి
- 200 మందికి పైగా ఉద్యోగులు ఉన్న శాఖలు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు లక్ష్యాలను ప్రతి శాఖ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వంపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి జిల్లా అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదుకు అధికారులు పూర్తి సహకారం అందించాలని, ప్రతి శాఖలోని ఉద్యోగులను సభ్యత్వం నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి శాఖకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించి సభ్యత్వ నమోదు ప్రక్రియను పర్యవేక్షించాలని, ప్రతి శాఖకు లక్ష్యాలను నిర్ధారించి వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అధికారి స్వయంగా సభ్యత్వం నమోదు చేసుకోవాలని సూచించారు. అత్యవసర సమయాల్లో రెడ్ క్రాస్ సొసైటీ సేవలు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కనీసం సుమారు వెయ్యి సభ్యత్వాలు నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని తెలిపారు. ముఖ్యంగా రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్య, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఆర్ అండ్ బి తదితర శాఖలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. 200 మందికి పైగా ఉద్యోగులు ఉన్న శాఖలు రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వాల నమోదుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎంకు
# కృతజ్ఞతలు తెలిపిన మండల నాయకులు



**చింతకాని మే11 ప్రజాజ్యోతి ప్రతినిధి** :తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మధిర నియోజకవర్గానికి చెందిన నూతన కాంగ్రెస్ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు నూతన అధ్యక్షులుగా నియామకమైన సందర్భంగా వారు డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు చింతకాని మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైన కన్నెబోయిన గోపి, చింతకాని మండల కాంగ్రెస్ కమిటీ నాయకులతో కలిసి వచ్చి భట్టి విక్రమార్కను కలిసి కృతజ్ఞతలు తెలిపి. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు వారు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ సీఎం నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రికి పలు కీలక సూచనలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు, భావజాలానికి కట్టుబడి క్రమశిక్షణతో పని చేయాలి. మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలి. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్ధవంతంగా తీసుకెళ్లాలి. అని సూచించారు. పార్టీ బలోపేతం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై లిభట్టి విక్రమార్క వారికి దిశానిర్దేశం చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ కార్యదర్శి కొప్పుల గోవిందరావు, మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున, మండల కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, పాతర్లపాడు మాజీ ఎంపీటీసీ బొర్రా ప్రసాద్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆలస్యం బసవయ్య, నారగాని శ్రీనివాసరావు, కుక్కల వెంకటేశ్వర్లు, ఉస్మాన్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన
# చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు



**చింతకాని మే 11 ప్రజాజ్యోతి ప్రతినిధి** :మండల పరిధిలోని రేపల్లెవాడ గ్రామంలో వేషాల సూర్యనారాయణ–లక్ష్మీకాంతమ్మ కుమారుడు శంకర్రావు -- కావ్యశ్రీ వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి ముఖ్య అతిథిగా హాజరైన చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు నూతన వధూవరులను ఆప్యాయంగా ఆశీర్వదించి, నూతన వస్త్రాలను బహుకరించారు ఈ కార్యక్రమంలో రేపల్లెవాడ గ్రామ మాజీ సర్పంచ్ అంగడి ఝాన్సీ సుధాకర్, బండి శ్రీనివాసరావు, షేక్ ఏసోబు, సామినేని శ్రీనివాసరావు కొత్తపెల్లి వెంకటేశ్వర్లు (శివ), కట్ట రాములు, షేక్ పుల్లయ్య, వడ్డెబోయిన గోపి, పగిడిపల్లి నాగరాజు, వడ్రానపు గౌతమ్, పగిడిపల్లి కిషోర్, సామినేని ఫణీందర్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## బైరు శ్రీరాములు-రమాదేవి దంపతుల
# కుమార్తె ఎంగేజ్మెంట్‌కు హాజరైన గ్రామ పెద్దలు



**చింతకాని మే 11 ప్రజాజ్యోతి ప్రతినిధి** :బైరు శ్రీరాములు రమాదేవి దంపతుల కుమార్తె ఎంగేజ్మెంట్ కార్యక్రమంలో పాల్గొని ఝాన్సీ శివకుమారును ఆశీర్వదించిన సిపిఎం పార్టీ మధిర డివిజన్ కమిటీ సభ్యులు ఆలస్యం రవి చింతకాని మండల కమిటీ సభ్యులు తోటకూరి వెంకట నరసయ్య నాగులవంచ గ్రామ ఒకటవ కార్యదర్శి కందరబోయిన కొండలరావు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వంకాయలపాటి సత్యనారాయణ చిలువేరి శంకరు

# మరల ఇందిరమ్మ ఇండ్ల సర్వే జరిపించాలి

- చిన్నరాయిగూడెం గ్రామ ప్రజల డిమాండ్
- సొంత ఇంటి కల నెరవేరదెప్పుడు..?
- 500 కుటుంబాలు ఉన్న గ్రామంలో కేవలం 11 ఇండ్లే మంజూరు
- ఎల్-1, ఎల్-2, ఎల్-3 పేరుతో మమ్మల్ని పక్కన పెడుతున్నారు : బాధితుల ఆవేదన
- గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు గ్రామస్తుల వినతి



**కొత్తగూడెం , మే 11 (ప్రజాజ్యోతి)** సొంత ఇంటి ఆశతో ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న చిన్నరాయిగూడెం గ్రామ ప్రజలకు నిరాశే మిగిలిందని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం చిన్నరాయిగూడెం గ్రామానికి చెందిన పలు కుటుంబాలకు చెందిన మహిళలు సోమవారం జిల్లా సమీకృత కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. గ్రామంలో వందలాది పేద కుటుంబాలు తాత్కాలిక గుడిసెలలో జీవనం సాగిస్తున్నప్పటికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో తీవ్ర అన్యాయం జరిగిందని వారు ఆరోపించారు. చిన్నరాయిగూడెం గ్రామంలో సుమారు 500 కుటుంబాలు ఉన్నప్పటికీ గ్రామంలో కేవలం 11 కుటుంబాలకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నో ఏండ్లుగా ఇండ్లు లేకుండా జీవిస్తున్న తమకు పూర్తిగా సొంత ఇల్లు లేదని దరఖాస్తుల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ స్థానిక అధికారులు ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాల పేరుతో తమను తిరస్కరిస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. అసలు ఏ ప్రమాణాల ఆధారంగా జాబితాలు రూపొందించారో తెలియడం లేదని అర్హులైన అనేక మంది పేదలు జాబితా బయటే మిగిలిపోయారని తెలిపారు. ప్రభుత్వం పేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం నిజమైన లబ్ధిదారులకు చేరాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో వాస్తవ పరిస్థితులను అధికారులు పరిశీలిస్తే ఇంకా వందలాది కుటుంబాలు ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న విషయం బయట పడుతుందని పేర్కొన్నారు. అవసరమైతే చిన్నరాయిగూడెం గ్రామంలో మరోసారి పూర్తి స్థాయి ఇంటింటి సర్వే నిర్వహించాలని అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఇళ్లు లేక ఇబ్బందులు పడు తున్న తమలాంటి పేద కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని సొంత ఇంటి కల నెరవేర్చాలని గ్రామ ప్రజలు వేడుకున్నారు. గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ కు పిర్యాదు ఇచ్చిన వారిలో కె. సరోజినీ, జ్యోతి శ్రీ, కె. ఉమామహేశ్వరి, ఎస్.రేణుక, కె మాధవి, ఎస్.సమ్మక్క, టి. శ్రీలత, కె. ఆదిలక్ష్మి, టి. వెంకటమ్మ, పి. సత్తెమ్మ, ఎమ్. నర్సమ్మ, కె. కాంతమ్మ మరియు తదితరులు ఉన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలనీ తమ ఆవేదనను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**ఒకే ఇంట్లో మూడు, నాలుగు కుటుంబాలు జీవిస్తున్నాయి: కె. కుంజా సరోజిని**

ఒక్కో ఇంట్లో ముగ్గురు, నలుగురు కుటుంబాలు కలిసి ఇరుకైన గదుల్లో నివాసం ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కుంజా సరోజిని అన్నారు. పెరుగుతున్న కుటుంబ సభ్యులతో సరైన వసతి లేక చిన్న పిల్లలు, మహిళలు అనేక కష్టాలు పడుతున్నారని తెలిపారు. సొంత ఇల్లు లేకపోవడంతో అసౌకర్యాలతో జీవనం కొనసాగించడం చాలా కష్టంగా మారిందన్నారు. గ్రామంలో నిజంగా అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఎన్నో సంవత్సరాలుగా సొంతింటి కలతో ఎదురుచూస్తున్న మా వంటి కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి అని సరోజిని కోరారు.

**ఇందిరమ్మ ఇండ్లు వస్తే ఒక భరోసా కలుగుతుందని ఆశపడ్డాం: ఎస్. జ్యోతి శ్రీ**

చిన్నరాయిగూడెం గ్రామంలో ఇప్పటికీ సరైన రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని జ్యోతి శ్రీ ఆవేదన చెందారు. వర్షం పడితే రోడ్లు బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని అన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాల కొరతతో చిన్నపిల్లలు, వృద్ధులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు వస్తే కనీసం మా కుటుంబాలకు ఒక భరోసా కలుగుతుందని ఆశపడ్డామని కానీ గ్రామంలో అర్హులైన చాలామందికి ఇండ్లు మంజూరు కాకపోవడం బాధాకరం అంటూ తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి తమ గ్రామ పరిస్థితులను పరిశీలించి నిజమైన పేదలకు ఇండ్లు మంజూరు చేయాలి అని జ్యోతి శ్రీ తెలిపారు.

**మరల సర్వే నిర్వహించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి న్యాయం చేయండి: ఎస్. ప్రియాంక**

ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన కుటుంబాలు మా గ్రామంలో ఇంకా చాలా ఉన్నాయని ఎస్. ప్రియాంక అన్నారు. తమ గ్రామంలో చాలామందికి దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లభించలేదని తెలిపారు. గత సర్వేలో నిజమైన పేద కుటుంబాలు చాలామంది గుర్తింపు పొందలేదన్నారు. ఒక్కో ఇంట్లో పలుకుటుంబాలు ఇబ్బందులతో జీవనం సాగిస్తున్నా సరైన ప్రాధాన్యం దక్కలేదని అధికారులు మరోసారి గ్రామంలో సమగ్ర సర్వే నిర్వహించి అర్హులైన వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. నిజంగా ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి న్యాయం చేయాలని ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి అని ప్రియాంక కోరారు.

# ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

## జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి ,ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్, మే 11:
ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు.

సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకుని, సమస్యల పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సంగారెడ్డి పట్టణంలోని పలు ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ తెరిచి ఉండటం ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రమాదాలు జరగక ముందే వాటిని పరిశీలించి వెంటనే మూసివేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి రోడ్ల డివైడర్లపై ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద ఫ్లెక్సీలు, పాత ఫ్లెక్సీలను తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు.సింగూర్ డ్యాం వద్ద బారికేడ్లు, హెచ్చరిక సైన్ బోర్డులు లేవని తన దృష్టికి వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రమాదాలు నివారించేందుకు వెంటనే బారికేడ్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులను 30 రోజులలోపు పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.జిల్లాలో డివిజన్ వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 108 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందులో కలెక్టరేట్‌కు 23, సంగారెడ్డి డివిజన్‌కు 27, ఆందోల్ డివిజన్‌కు 03, నారాయణఖేడ్ డివిజన్‌కు 27, జహీరాబాద్ డివిజన్‌కు 29 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి పాల్పడుతున్న డీఎస్పీ, ఎస్ఐ, సిఐ

## వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలి: గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి

## తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ కు వినతి

ప్రజా జ్యోతి సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్ :
సంగారెడ్డి డి.ఎస్.పి సత్తయ్య గౌడ్, కొండాపూర్ సిఐ సుమన్ కుమార్, ఎస్ఐ సోమేశ్వరి లు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని సోమవారం తెలంగాణ డిజిపి కి మాజీ వైయస్సార్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతికి పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని




రాసిన డిజిపి సివి ఆనంద్ కోరినట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు కాంగ్రెస్ నాయకులు గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్ లోని డిజిపి కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ సి వి ఆనంద్ గారికి కొండాపూర్ పోలీస్ ల అవినీతి పై చర్యలు తీసుకోవాలని తోగర్ పల్లి కి చెందిన నేత వైయస్సార్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌరి రెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ కొండాపూర్ సీఐ, ఎస్ ఐ, సంగారెడ్డి డి.ఎస్.పి లు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. తప్పుడు కేసులు, పిడి యాక్ట్ బెదిరింపులతో తనను ఇబ్బందుల గురి చేశారని, పేద ప్రజల వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ లో పేర్లతో జైల్లో వేస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారని డీజిపి సివి ఆనంద్ కి వినతి పత్రం అందజేసినట్లు గౌరీ రెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.

# 13న పాలిటెక్నిక్ ప్రవేశ రీక్ష



మొదటిపేజీ తరువాయి..

నుంఇ మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 56,494 మంది విద్యార్థులు, 49,945 మంది విద్యార్థినులు పరీక్షలకు దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 293 పరీక్ష కేంద్రాను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు పరీక్ష సమయానికి గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్ కానీ, ఏ ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులను అనుమతించబోమని వివరించారు.

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

హన్మకొండ జిల్లా ప్రతినిధి, మే 11, (ప్రజాజ్యోతి):
ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి నిర్వహించిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రానున్న 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్, అశ్వారావుపేట వంటి నియోజకవర్గాలు ఇప్పటికే 80 శాతానికి పైగా మ్యాపింగ్ పూర్తి చేశాయని తెలిపారు. ఒడిశా రాష్ట్రం 90 శాతం, కర్ణాటక 81 శాతం, మహారాష్ట్ర 68 శాతం మ్యాపింగ్ పూర్తి చేశాయని, తెలంగాణ ఇంకా పురోగతిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను ప్రోత్సహిస్తూ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం



కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి అర్హ ఓటరు పేరు సక్రమంగా మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.




హనుమకొండ పశ్చిమ నియోజకవర్గంలో 56 శాతం, పరకాల నియోజకవర్గంలో 80 శాతానికి పైగా ఎలక్టోరల్ మ్యాపింగ్ పూర్తయ్యిందని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్ఓ కె. శ్రీనివాస్, ఆర్డీవోలు రమేష్ రాథోడ్, నారాయణ, తహసీల్దార్లు విజయలక్ష్మి , రవీందర్ రెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ జగత్ సింగ్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బండి కుమారుడి కేసుపై సీఎం సీరియస్

మొదటిపేజీ తరువాయి..

అయ్యారు. భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుపైన తక్షణమే విచారణ మొదలుపెట్టాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను సీఎం ఆదేశించారు. మే 8న ఫిర్యాదు వస్తే ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. కేసు వివరాలను సీఎంకు డీజీపీ వివరించారు. ప్రధాన మంత్రి మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అంతా భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని తెలియజేశారు. కేసు సమగ్ర విచారణ కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాలని డీజీపీ ఆనంద్‌కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బండి భగీరథ్‌పై ఈనెల 8న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఓ ఫిర్యాదు వచ్చింది. తనను భగీరథ్ వేధిస్తున్నారని, పోక్సో కింద కేసు నమోదు చేయాలని ఓ మైనర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటి వరకు భగీరథ్‌పై పోలీసు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పాటు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయనట్లు తెలుస్తోంది. ఈ అంశం తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేంద్ర మంత్రి కుమారుడిని ప్రభుత్వమే కాపాడుతోందంటూ ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితి నెలకొంది. తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడి కేసులో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ కేసును సమగ్రంగా విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు ప్రస్తుతం రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఈ కేసు సున్నితమైనది కావడంతో దర్యాప్తును మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు. బాధితురాలు బాలిక కావడం, ఈ కేసులో ఉన్న ఆరోపణల తీవ్రత దృష్ట్యా విచారణలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సిట్ బృందం ఇప్పటికే కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరించే పనిని ప్రారంభించినట్లు సమాచారం. పోలీసులు బాలిక స్టేట్మెంట్‌ను చట్టపరమైన నిబంధనల ప్రకారం రికార్డ్ చేశారు. ఈ ప్రకటన ఆధారంగా మరిన్ని అంశాలను వెలికి తీసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా, డిజిటల్ ఆధారాలు కూడా పరిశీలించే అవకాశముంది. ఈ ఘటనపై హైదరాబాద్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై కేసు నమోదు చేశారు. బాలిక ఫిర్యాదు, ప్రాథమిక ఆధారాల ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు వెలుగులోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ ప్రకంపనలు మొదలయ్యాయి. పోలీసులు పోక్సో చట్టం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. బాలికకు సంబంధించిన కేసు కావడంతో చట్టపరమైన పక్రియలను అత్యంత జాగ్రత్తగా అమలు చేస్తున్నారు.

# గుప్తనిధుల కోసమే ఆలయం కూల్చివేత

మొదటిపేజీ తరువాయి..

వరంగల్ జిల్లాలో ఎన్నో ఆలయాలను పునరద్ధరించామని గుర్తు చేశారు. రామప్ప ఆలయానికి బీఆర్ఎస్ యునెస్కో గుర్తింపు తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ధ్వంసం



చేసిన శివాలయాన్ని పునర్మిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సూదర్శన్ రెడ్డి, దాస్యం వినయ భాస్కర్, అరూరి రమేష్, శంకర్ నాయక్ తదితరులు ఉన్నారు.

# కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం



మొదటిపేజీ తరువాయి..

భట్టి విక్రమార్క తెలిపారు. కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్ ప్రభావంపై సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఉండాలని కమిటీ సభ్యులు తెలిపారు. కేవలం అంకెల్లో కాదని.. వాస్తవ అవసరాలకు తగ్గట్టే వేతనాలు ఉండాలని చెప్పుకొచ్చారు. దేశంలో ఉత్తమ వేతన నమూనాలను తెలంగాణలో అమలు చేస్తామని భట్టి విక్రమార్క అన్నారు. కార్మికుల పక్షపాతి రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అసంఘటిత, సంఘటిత రంగ కార్మికులకు లాభం చేకూరేలా చర్యలు చేపడతామని అన్నారు. అన్నివర్గాల అభిప్రాయాలతో త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.



# జవాబుదారీదనం లేని ప్రధాని ప్రసంగం

మొదటిపేజీ తరువాయి..

కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు అని అన్నారు. రాజీపడిన ప్రధాని మోదీ.. దేశాన్ని నడపడం కష్టమన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో సోమవారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైనే నెట్టేస్తున్నారని, ఆయన మాత్రం జవాబుదారీతనం నుంచి తప్పించుకు తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో బీజేపీ భారీ బహిరంగ సభ నిర్వహించింది. ఈ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశంపై తీవ్రంగా ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్, యూరియా ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. రెండు నెలల నుంచి ప్రజలపై భారం పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, యుద్ధం కారణంగా వచ్చే నష్టాన్ని కేంద్రమే భరిస్తోందని వెల్లడించారు. క్లిష్ట సమయంలో దేశ ప్రజలు పెట్రోల్, డీజిల్ పరిమితంగా వినియోగించాలని కోరారు. ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని.. వర్క్‌ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ మీటింగ్‌లు పెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. ఇవన్నీ కూడా ప్రజలను అప్రమత్తం చేసేవిగా లేవని రాహుల్ అన్నారు. కేవలం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని అన్నారు.




# బండి భగీరథను వెంటనే అరెస్ట్ చేయాలి

## ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్

హైదరాబాద్,మే11(ప్రజాజ్యోతి):
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌ను అరెస్టు చేయకుండా పోలీసులు తాత్సారం చేస్తున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మండిపడ్డారు. మైనర్ బాలిక అని తెలిసి కూడా బండి సంజయ్ కుమారుడు అత్యాచారానికి ఒడిగట్టాడని తెలిపారు. బీజేపీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిందితుడైన భగీరథ్‌ను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని.. బాధితురాలికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. హైదరాబాద్ చిలుకానగర్‌లో బండారి లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్, రేవంత్ రెడ్డి కుమ్మక్కై డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మైనర్ బాలికకు న్యాయం చేయకుండా, బండి కుమారుడిని కాపాడేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు ఒక న్యాయమా అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోక్సో కేసులో బండి సంజయ్‌కు సహకరిస్తుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆరోపించారు. బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదైనా అరెస్టు చేయడం లేదని మండిపడ్డారు. బాలికపై హనీట్రాప్, వసూళ్ల కేసు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. ప్రధాని మోదీ బేటీ బచావో కేవలం నినాదానికే పరిమితమా అని నిలదీశారు. బండి సంజయ్ కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలని బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో బాధితుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతుందని స్పష్టం చేశారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967